సంపుటి : 9
సంచిక : 292
బుధవారం
15 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
Contact For Ads:
7579339999

# ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఓ శకం ముగిసింది

# పోరాట యోధుడు ముద్రగడ పద్మనాభం ఇకలేరు




**అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస**

**కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం ఇకలేరు**

**నాలుగుసార్లు ఎమ్మెల్యే.. కాకినాడ ఎంపీ.. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా సేవలు**

**ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం.. సంతాపం తెలిపిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్**

**కాకినాడ, జూలై 14, విశ్వం వాయిస్ ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న మాజీ మంత్రి, కాకినాడ మాజీ ఎంపీ, ప్రముఖ కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఇకలేరు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మిగతా .. 2లో..

## టీటీడీ పాలకమండలి

# కీలక నిర్ణయాలు

- నేటి అర్ధరాత్రి నుంచి దాతలకు కొత్త నిబంధనలు
- టీటీడీ ట్రస్టులు, పథకాల దాతల ప్రివిలేజెస్‌లో కీలక మార్పులు
- సామాన్య భక్తుల కోసం తిరుమలలో రూ.6.31 కోట్లతో శాశ్వత షెడ్ల నిర్మాణం
- ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో 100 గదుల నిర్మాణానికి టెండర్లకు ఆమోదం
- వేద పారాయణ స్కీం కింద 791 మంది వేద పండితులను నియమించాలని నిర్ణయం
- ఎస్వీ మ్యూజియం ప్రవేశ రుసుము రూ.50గా ఖరారు, నిర్వహణపై టాటాతో చర్చలు




**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. టీటీడీ పరిధిలోని వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు ఇచ్చే దాతలకు కల్పించే ప్రత్యేక సౌకర్యాలు (ప్రివిలేజెస్)లో మార్పులు చేస్తున్నట్లు ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. ఈ కొత్త నిబంధనలు మంగళవారం అర్ధరాత్రి నుంచే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన బోర్డు సమావేశం అనంతరం ఆయన ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరూపత తీసుకురావడమే లక్ష్యమని ఆయన తెలిపారు. అయితే, ఇప్పటికే విరాళాలు సమర్పించిన మిగతా .. 2లో..

## అసలు సమస్యే రాకుండా చూసేవాడు

# అద్భుతమైన అధికారి

- మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమావేశం
- సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత అన్న చంద్రబాబు
- అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లాలి.. నాలుగు గోడలకే పరిమితం కావొద్దని సూచన
- ఇకపై నెలవారీ ఆర్థిక నివేదికల ఆధారంగా సమీక్ష ఉంటుందని స్పష్టీకరణ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** "సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించేవాడు మంచి అధికారి అయితే, అసలు సమస్యే తలెత్తకుండా ముందుచూపుతో పనిచేసేవాడు అద్భుతమైన అధికారి. ఆ కోణంలో అధికారులు పనిచేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నాలుగు గోడలు దాటి ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లగలమని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం మాట్లాడారు.

**డేటా ఆధారిత పాలన.. నెలవారీ నివేదికలతో సమీక్ష**

డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ ఫలితాలు సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికోసం దేశంలోనే మొదటిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా రాష్ట్ర ప్రగతిని మిగతా .. 2లో..

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు

# ప్రాణాలు కోల్పోయారు

- మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన వైఎస్ జగన్
- మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదని ఆగ్రహం



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో బాధిత మత్స్యకార కుటుంబాలను, మిగతా .. 2లో..

# హర్మ్యూజ్‌లో 20శాతం టోల్.. వెనక్కి తగ్గిన ట్రంప్



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశ్చర్యకర ప్రకటన చేశారు. 20శాతం టోల్ విధిస్తున్నట్లు చేసిన ప్రకటనను ఉపసంహరించుకున్నట్లు వెల్లడించారు. దీనికి బదులుగా గల్ఫ్ దేశాలు అమెరికాతో కుదుర్చుకోబోయే భారీ పెట్టుబడులు, వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆ ఖర్చును భర్తీ చేయనున్నట్లు ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. హర్మ్యూజ్‌ను తమ అధీనంలోకి తీసుకుంటున్నట్లు మిగతా .. 2లో..

## అయోధ్య సీఈఓ పదవికి

# మాజీ ఐపీఎస్ అధికారి దరఖాస్తు





**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సీఈఓ పోస్టుకు మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ దరఖాస్తు చేసుకున్నారు. ఆ పదవి కోసం అమితాబ్ ఠాకూర్ పోటీకి దిగడం యూపీలో చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే..? 1992 బ్యాచ్ మిగతా .. 2లో..

## మాజీ మంత్రి అప్పలరాజుకు

# వ్యతిరేకంగా యాదవుల ఆందోళన



**పలాస, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా పలాసలో వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు వ్యతిరేకంగా యాదవులు ఆందోళనకు దిగారు. పట్టణంలోని శ్రీనివాస లాడ్జి కూడలి నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై మిగతా .. 2లో..




## ఏపీ పాలనలో వినూత్న ప్రయోగం..

# నెలవారీ నివేదికలతో పర్యవేక్షణ

**రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పాలనలో వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతున్నామని, డేటా ఆధారిత పాలన (డేటా డ్రివెన్ గవర్నెన్స్) దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్) ఆధారంగా ప్రభుత్వ పాలనను ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఆయన ప్రకటించారు. అమరావతిలో మిగతా .. 2లో..

## జగన్ హయాంలో 275 మంది

# మత్స్యకారులు మృతి చెందారు

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మత్స్యకారులను పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలపై మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని అన్నారు. వైసీపీ పాలనలో ప్రకృతి వైపరీత్యాల వల్ల 275 మంది మృతి చెందారని తెలిపారు. అయితే, వారిని జగనే చంపేశారని అవివేకంగా తాము మాట్లాడబోమన్నారు. నాడు మృతి చెందిన 275 మంది కుటుంబాలను జగన్ ఎందుకు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఆంధ్రప్రదేశ రాజకీయాల్లో ఓ శకం ముగిసింది

చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 73 సంవత్సరాలు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాప్రతినిధిగా, మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా, ఉద్యమ నాయకుడిగా విభిన్న పాత్రలు పోషించిన ముద్రగడ మరణంతో గోదావరి జిల్లాలతోపాటు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర విషాదం నెలకొంది. రాజకీయ పార్టీల నేతలు, కాపు సంఘాల ప్రతినిధులు, అనుచరులు, అభిమానులు ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**కిర్లంపూడి నుంచి చట్టసభల దాకా...**

1953 జనవరి 22న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబంలో ముద్రగడ పద్మనాభం జన్మించారు. ఆయన తండ్రి ముద్రగడ వీరరాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి స్వతంత్ర శాసనసభ్యుడిగా సేవలందించారు. కుటుంబం నుంచి అందిన రాజకీయ వారసత్వాన్ని కొనసాగించిన ముద్రగడ, చిన్న వయస్సులోనే క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు, ముక్కుసూటి మాటతీరు, నిర్ణయాల్లో దృఢత్వంతో అనతికాలంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

**నాలుగుసార్లు ఎమ్మెల్యే.. కాకినాడ ఎంపీ**

ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికైన ముద్రగడ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. అనంతరం కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికై జాతీయ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు. జనతా పార్టీతో ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీల మీదుగా సాగింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలు మారినప్పటికీ ప్రజా సమస్యలపై స్పందించడంలో, తన అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించడంలో ఆయన ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు.

**కాపు ఉద్యమానికి పోరాట చిరునామా**

ముద్రగడ పద్మనాభం పేరు ఆంధ్రప్రదేశ్‌లో కాపు రిజర్వేషన్ల ఉద్యమంతో విడదీయరాని విధంగా ముడిపడిపోయింది. కాపు సామాజిక వర్గాన్ని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో ఆయన అనేక సంవత్సరాలపాటు ఉద్యమాలు చేపట్టారు. నిరాహార దీక్షలు, బహిరంగ సభలు, ప్రభుత్వాలకు లేఖలు, ప్రత్యక్ష ఆందోళనల ద్వారా కాపు రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా నిలిపారు. 2016లో నిర్వహించిన 'కాపు ఐక్య గర్జన', అనంతరం కిర్లంపూడిలో చేపట్టిన నిరాహార దీక్షలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఉద్యమకారులపై నమోదైన కేసుల ఉపసంహరణ, అరెస్టయిన వారి విడుదల, కాపులకు రిజర్వేషన్ల అమలు వంటి డిమాండ్లపై ప్రభుత్వాలతో రాజీలేని పోరాటం సాగించారు. దీంతో ఆయన కాపు ఉద్యమానికి ప్రధాన సారథిగా గుర్తింపు పొందారు.

**ముక్కుసూటితనం.. మాటకు కట్టుబాటు**

రాజకీయాల్లో ముద్రగడది ప్రత్యేకమైన శైలి. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించడం, నిర్ణయం తీసుకున్న తర్వాత వెనక్కి తగ్గకపోవడం ఆయన వ్యక్తిత్వంలోని ప్రధాన లక్షణాలుగా నిలిచాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో పిఠాపురం నియోజకవర్గ ఫలితంపై ఆయన చేసిన రాజకీయ సవాల్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఓడించలేకపోతే తన పేరు మార్చుకుంటానని ప్రకటించిన ముద్రగడ, ఎన్నికల ఫలితాల అనంతరం ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. ప్రభుత్వ గెజిట్ ద్వారా తన పేరును అధికారికంగా లి'ముద్రగడ పద్మనాభరెడ్డి'లిగా మార్చుకున్నారు. రాజకీయ సవాల్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ, తాను ప్రకటించిన మాటకు కట్టుబడిన నాయకుడిగా ఆ పరిణామం ఆయన రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా నిలిచింది.

**నాలుగు దశాబ్దాల ప్రజా జీవితం**

శాసనసభ్యుడిగా, మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా, ఉద్యమ నాయకుడిగా ముద్రగడ పద్మనాభం నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో కొనసాగారు. అధికారంలో ఉన్నప్పటికీ, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తనదైన రాజకీయ పంథాను అనుసరించారు. ఆయన రాజకీయ నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై స్పందించే నాయకుడిగా, ఉద్యమ రాజకీయాలకు ప్రతీకగా, మాటకు కట్టుబడే వ్యక్తిగా రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

**ముగిసిన పోరాట అధ్యాయం**

ముద్రగడ పద్మనాభం మరణంతో గోదావరి జిల్లాల రాజకీయాల్లో బలమైన గొంతు మూగబోయింది. కాపు ఉద్యమంలో ఒక కీలక అధ్యాయం ముగిసింది. ఆయనను అభిమానించే ప్రజలు, ఉద్యమ సహచరులు, రాజకీయ అనుచరులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ ప్రజా సమస్యలపై సాగించిన పోరాటాలు, ఉద్యమాల్లో ప్రదర్శించిన దృఢత్వం, రాజకీయాల్లో చూపిన ముక్కుసూటితనం చిరస్మరణీయంగా నిలిచిపోతాయి.

**ముద్రగడ మరణవార్త విచారం కలిగించింది: సీఎం చంద్రబాబు**

మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నేత ముద్రగడ పద్మనాభం మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఆయన మృతి వార్త తనను తీవ్ర విచారానికి గురిచేసిందని తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. "మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూశారన్న వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముద్రగడ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తన సంతాప సందేశంలో తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభం తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. మంత్రిగా రాష్ట్రానికి సేవలు అందించారు. పలువురు రాజకీయ ప్రముఖులు ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తున్నారు.

**ముద్రగడ పద్మనాభం ఇక లేరని తెలిసి చింతిస్తున్నాను: పవన్ కల్యాణ్**

మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పవన్ కల్యాణ్ తన సంతాప సందేశంలో, "మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభయ తుదిశ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ రాజకీయ సేవలను పవన్ గుర్తుచేసుకున్నారు. 1978లో తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన ఆయన, మొత్తం నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారని వివరించారు. ముద్రగడ పద్మనాభం అర్ధాంగి, కుమారుడు, కుమార్తెతో పాటు ఇతర కుటుంబ సభ్యులకు, ఆయన మద్దతుదారులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

### టీటీడీ పాలకమండలి

# కీలక నిర్ణయాలు

పాత దాతలకు ప్రస్తుతం అమల్లో ఉన్న సౌకర్యాలు యథావిధిగా కొనసాగుతాయని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో భక్తుల సౌకర్యార్థం, ఆలయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ధర్మప్రచారం వంటి అంశాలపై అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

**సమావేశంలో తీసుకున్న మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలు**

భక్తుల కోసం శాశ్వత షెల్టర్లు: తిరుమలకు వచ్చే సామాన్య భక్తుల సౌకర్యార్థం, సర్వదర్శనం టోకెన్లు పొందిన వారు వేచి ఉండేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం రూ.6.31 కోట్ల వ్యయంతో ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్లకు ఆమోదం తెలిపింది. డ్యామ్‌ల పటిష్టతకు చర్యలు: తిరుమలలోని కుమారధార, పసుపుధార డ్యామ్‌ల పటిష్టతకు చర్యలు చేపట్టారు. ఈ డ్యామ్‌ల వద్ద డబుల్ లేన్ వంతెన నిర్మాణానికి రూ.2.77 కోట్లు మంజూరు చేస్తూ బోర్డు ఆమోదముద్ర వేసింది. హరిత ఇంధన ప్రోత్సాహం: తిరుమలలో హరిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కీలక అడుగు వేశారు. జీఎన్‌సీ సమీపంలో 800 కిలోవాట్ల సామర్థ్యం గల విండ్ టర్బైన్ జనరేటర్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ దీన్ని విరాళంగా ఏర్పాటు చేసి, 25 సంవత్సరాల పాటు టీటీడీకి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనుంది. ఎస్వీ మ్యూజియం ప్రవేశ రుసుము: తిరుమలలోని ఎస్వీ మ్యూజియం సందర్శనకు ప్రవేశ రుసుమును నిర్ణయించారు. 12 ఏళ్లు పైబడిన సందర్శకుల నుంచి జీఎస్టీతో కలిపి రూ.50 వసూలు చేయాలని తీర్మానించారు. భవిష్యత్తులో మ్యూజియం నిర్వహణ బాధ్యతలను టాటా సంస్థకు అప్పగించే అంశంపై ఆ సంస్థను సంప్రదించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు.

**వ్యర్థాల శాస్త్రీయ శుద్ధి:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా, తిరుమల కాకులమానుతిప్ప సమీపంలో పేరుకుపోయిన పాత వ్యర్థాల సమస్యకు పరిష్కారం కనుగొన్నారు. 25 ఏళ్లకు పైబడిన ఘన వ్యర్థాలను బయో-రిమీడియేషన్, బయో-మైనింగ్ పద్ధతుల ద్వారా శాస్త్రీయంగా శుద్ధి చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేశారు.

**అగ్నిమాపక వ్యవస్థల నిర్వహణ:** భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ తిరుమల, తిరుపతిలోని టీటీడీ ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల సమగ్ర నిర్వహణ కోసం రూ.2.35 కోట్లతో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించారు.

**పాత భవనాల స్థానంలో కొత్తవి:** తిరుమలలోని టీబీసీ, ఏటీసీ విశ్రాంతి భవనాల వద్ద ఉన్న 12 పాత భవనాలను తొలగించి, వాటి స్థానంలో దాతల సహకారంతో నూతన భవనాలు నిర్మించాలని నిర్ణయించారు.

**2027 క్యాలెండర్లు, డైరీల ముద్రణ:** 2027వ సంవత్సరానికి సంబంధించి 10 లక్షల డైరీలు, 13.50 లక్షల 12 పేజీల క్యాలెండర్లు, 75 వేల 6 పేజీల క్యాలెండర్ల ముద్రణకు బోర్డు ఆమోదం తెలిపింది.

**ఆక్టోపస్ బేస్ క్యాంప్‌లో సదుపాయాలు:** తిరుమల ఆక్టోపస్ బేస్ క్యాంప్‌లో అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు, ఎఫ్ఎంఎస్ సేవల కోసం రూ.2.91 కోట్లు మంజూరు చేశారు.

**ఒంటిమిట్టలో స్వర్ణ కవచాలు:** ఒంటిమిట్ట శ్రీ సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి మూల విరాట్టులకు బంగారు కవచాలను తయారు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన 1000 గ్రాముల (ఒక కిలో) బంగారాన్ని టీటీడీ ట్రెజరీ నుంచి వినియోగించుకోవడానికి బోర్డు ఆమోదం తెలిపింది.

**ఒంటిమిట్టలో 100 గదుల వసతి గృహం:** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయం వద్ద యాత్రికుల సౌకర్యార్థం 100 గదులతో విశ్రాంతి గృహం నిర్మించాలని నిర్ణయించారు. రూ.17.84 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణానికి టెండర్లను ఆమోదించారు.

**ఒంటిమిట్టలో భూసేకరణ:** ఒంటిమిట్ట ఆలయ ఈశాన్య మాడవీధి విస్తరణ, యాత్రికుల సౌకర్యాల అభివృద్ధి కోసం 6,103 చదరపు అడుగుల భూమిని సేకరించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగానికి రూ.2.11 కోట్లు చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

**తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి:** తిరుపతిలోని శ్రీ తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారి ఆలయంలో ముఖ మండపంపై 'సాలహారం' నిర్మాణం, మిగిలిన ప్రాకార గోడ నిర్మాణ పనుల కోసం రూ.2.50 కోట్లతో టెండర్‌కు ఆమోదం తెలిపారు.

**791 మంది వేద పండితుల నియామకం:** హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా వేద పారాయణానికి పెద్దపీట వేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 'వేద పారాయణ స్కీం' ద్వారా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లోనూ నిత్య పారాయణం నిర్వహించేందుకు 791 మందిని సంభావన వేద పండితులుగా నియమించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

**కళాకారుల పారితోషికం పెంపు:** హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల వంటి విభాగాల్లో సేవలందిస్తున్న కళాకారులకు వారి నైపుణ్యాన్ని బట్టి పారితోషికాన్ని పెంచేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది.

**క్యాటరింగ్ సూపర్‌వైజర్ పోస్టులు:** టీటీడీ క్యాంటీన్ల విభాగంలో ఉన్న 65 సర్వర్ల పోస్టులను క్యాటరింగ్ సూపర్‌వైజర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో డా. ఎ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### అసలు సమస్యే రాకుండా చూసేవాడు

# అద్భుతమైన అధికారి

సమీక్షించుకునే విధానానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. "ఇకపై ప్రతీ నెలా ఆర్థిక నివేదికలు విడుదల చేస్తాం. వాటి ఆధారంగా ప్రభుత్వ శాఖల పనితీరు, రెవెన్యూ రాబడులు, అధికారుల నైపుణ్యాలను అంచనా వేసుకుని ముందుకు వెళ్తాం. ప్రతీ నెలా కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమావేశమై పురోగతిని సమీక్షించుకుందాం," అని తెలిపారు. గత ఐదేళ్ల (2019-24) పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని, విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "గత రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం సమిష్టిగా పనిచేసి, క్షేత్రస్థాయిలో కొంతవరకు మార్పు తేగలిగాం. గత పాలనలో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం పోయింది. మేం వచ్చాక పరిస్థితి మార్చి, దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం" అని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను రూపొందించామని, తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు.

**అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని శాఖల పనితీరు సరిగా లేకపోవడంతో, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో భూ వివాదాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్‌లో 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పెట్టుకోవాలని అన్ని శాఖలకు సూచించారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి ప్రాంతాల్లో భూ సమస్యలను పరిష్కరించామని, రీసర్వే ద్వారా ప్రతి నెలా 9వ తేదీన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు.

**ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై స్పష్టత**

రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో దృష్టి సారించిందని సీఎం తెలిపారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆగస్టు 14న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేస్తామని, సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు

# ప్రాణాలు కోల్పోయారు

ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# హర్మూజ్‌లో 20శాతం టోల్.. వెనక్కి తగ్గిన ట్రంప్

సోమవారం ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. హర్మూజ్‌కు అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ప్రతిగా దాని మీదుగా రవాణా సాగించిన నౌకలు రవాణా చేసే సరకులో 20శాతాన్ని టోల్‌గా చెల్లించాలని ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. అయితే.. ట్రంప్ ప్రకటనపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హర్మూజ్ విషయంలో అమెరికా జోక్యాన్ని సహించబోమంది. ఆ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే బలప్రయోగానికి దిగుతామని హెచ్చరించింది. హర్మూజ్ తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ట్రంప్ తాజా ప్రకటన వచ్చింది.

### అయోధ్య సీఈఓ పదవికి

# మాజీ ఐపీఎస్ అధికారి దరఖాస్తు

యూపీ కేడర్ ఐపీఎస్ అధికారి ఠాకూర్‌పై పలు శాఖాపరమైన ఫిర్యాదుల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వశాఖ 2021 మార్చి 23న అతడిని పదవీ విరమణ చేయించింది. ఆయన పదవీ కాలం 2028 వరకు ఉన్నప్పటికీ.. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఐపీఎస్ స్థానం నుంచి తప్పిస్తున్నట్లు అప్పట్లో ప్రకటించింది. ఆ పదవిలో కొనసాగించడానికి ఆయన అనర్హుడని తెలిపింది. పదవీ విరమణ తర్వాత ఠాకూర్ 'అధికార్ సేన' అనే రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు. కానీ చివరికి ఎన్నికల బరిలోకి దిగలేదు. విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో అయోధ్య రామాలయంలో పరిపాలన, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణను బలోపేతం చేసే వ్యక్తులను అయోధ్య ఆలయ సీఈఓగా నియమించడానికి శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సిద్ధమవుతోంది. కాంట్రాక్టు పద్ధతిలో మూడేళ్ల పదవీకాలానికి సీఈవోను నియమిస్తామని, పనితీరు ఆధారంగా తర్వాత పొడిగింపు ఉంటుందని పేర్కొంది. ట్రస్ట్ నిర్ణయాలను అమలు చేయడం, ఆర్థిక వ్యవహారాలు, కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటం వంటి బాధ్యతలను కొత్త సీఈఓ నిర్వర్తించాల్సి ఉంటుంది.

### మాజీ మంత్రి అప్పలరాజుకు

# వ్యతిరేకంగా యాదవుల ఆందోళన

బైఠాయించి నినాదాలు చేశారు. గొర్రెల కాపరి దానయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నిర్లక్ష్యంగా బైక్ నడపటంతో గొర్రెలకాపరి దానయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ ప్రమాదంపై సాక్ష్యాలను అప్పలరాజు తారుమారు చేశారని.. ఆయన్ను శిక్షించాలని యాదవులు డిమాండ్ చేశారు. ఈ కేసు నుంచి తన కుమారుడిని తప్పించేందుకు సీదిరి అప్పలరాజు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. నేరానికి పాల్పడిన తన కుమారుడి స్థానంలో అప్పటికప్పుడు మరొకరిని ప్రవేశపెట్టి వ్యవస్థలు, వ్యక్తులను మేనేజ్ చేసినా ఆ గుట్టు రట్టైంది. నేరాన్ని కప్పిపుచ్చడం, పోలీసుల్ని తప్పుదారి పట్టించడం, నిందితుడ్ని ఘటనా స్థలం నుంచి ఆగమేఘాలపై తప్పించడం, సాక్ష్యాధారాలు మాయం చేయడానికి యత్నించడం, తన అనుచరులను రంగంలోకి దించి బాధితుడి కుటుంబంతో రాజీకి ప్రయత్నించడం.. ఇలా మొత్తం కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వమంతా నడిపించి విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టాలని చూసినా ఫలించలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సీదిరి అప్పలరాజు తన కుమారుడు ఆరవ్ వర్మను సోమవారం పోలీసుల ఎదుట లొంగిపోయేలా చేశారు. బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద ఆరవ్‌పై కేసు నమోదుచేశారు. నేరాన్ని కప్పిపుచ్చేందుకు కుట్ర పన్నిన సీదిరి అప్పలరాజుపై మాత్రం కేసు పెట్టలేదు. ఈ నేపథ్యంలో యాదవులు ర్యాలీ నిర్వహించి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఏపీ పాలనలో వినూత్న ప్రయోగం..

# నెలవారీ నివేదికలతో పర్యవేక్షణ

సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు. ఈ సరికొత్త విధానం ద్వారా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కేపీఐ) బేస్డ్ గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తామని పయ్యావుల వివరించారు. దీనివల్ల రాష్ట్రంలోని వివిధ రంగాల్లో నమోదయ్యే వృద్ధి రేటును, ప్రగతిని ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో గమనించేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ విధానం వల్ల ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే గుర్తించి, మనల్ని మనం సరిదిద్దుకుని ముందుకు సాగేందుకు ఆస్కారం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను సాకారం చేసుకునేందుకు ఈ నెలవారీ ఆర్థిక నివేదికలు ఎంతగానో ఉపకరిస్తాయని మంత్రి పయ్యావుల కేశవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఈ ప్రయత్నం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

### జగన్ హయాంలో 275 మంది

# మత్స్యకారులు మృతి చెందారు

పరామర్శించలేదని ప్రశ్నించారు. గొడ్డలి పార్టీ అబద్ధాల పునాదులపై పుట్టిందని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. సీదిరి అప్పలరాజు కుమారుడు ఓ వ్యక్తిని తన వాహనంతో ఢీకొట్టి చంపినా వైద్యం చేయించకపోవడం దారుణమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుందని, ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేసి మత్స్యకారుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. జగన్ చేసే చౌకబారు వ్యాఖ్యలను ప్రజలు నమ్మరని అన్నారు.

# ఎడిటర్ వాయిస్

## కూటమి కీలక భేటీ.. మరో హిట్ కోసం!

ఏపీలో టీడీపీ కూటమి కీలక సమావేశం ఈ జూలై 15వ తేదీ బుధవారం జరగబోతోంది. ఈ భేటీ చాలా కాలం తరువాత జరగడంతో ఆసక్తి పెరుగుతోంది. ఏపీలో మూడు పార్టీలు టీడీపీ జనసేన బీజేపీ కలిసి కూటమిలో ఉన్నాయి. ప్రభుత్వంలో కూడా భాగస్వామ్యంతో పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి పార్టీలు 2024లో ఎంతో ఐక్యతను ప్రదర్శించాయి. ఒక్క ఓటు కూడా పొల్లుపోకుండా కూటమికి దక్కేలా చూశాయి. అందుకే అద్భుతమైన విజయం కూటమి పార్టీలకు దక్కింది. అయితే ఇపుడు మరో ఎన్నికకు రంగం సిద్ధం అవుతోంది. అదే స్థానిక సంస్థలకు ఎన్నికలు.

**ఫోకస్ దాని మీదనే :** ఈ నేపథ్యంలోనే కూటమి పార్టీలు సమావేశం కానున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని రిపీట్ చేయాలన్న పట్టుదలతోనే ఈ భేటీ జరుగుతోంది. ప్రధాని అజెండా కూడా లోకల్ బాడీస్ కి ఎన్నికలు అని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించాలని కూటమి పట్టుదలగా ఉంది. అందువల్ల గ్రౌండ్ లెవెల్ లో మరింతగా కో ఆర్డినేషన్ కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళకు పై దాటింది. దాంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోంది కాబట్టి ప్రజల మద్దతు పూర్తిగా తమకే ఉంది అని గట్టిగా చాటి చెప్పాలన్నది కూటమి పెద్దల ఆలోచనగా ఉంది. అది జరగాలంటే మూడు పార్టీలు సమిష్టిగా మరింత చురుకుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది అని అంటున్నారు. స్థానిక సంస్థల విషయం చర్చించడంతో పాటు మూడు పార్టీల మధ్య సఖ్యతను ఇంకా పెంచుకోవాల్సిన అనివార్యత గురించి కూడా ఈ భేటీలో చర్చిస్తారు అని అంటున్నారు.

**పవన్ కి బదులుగా :** ఇక ఈ కూటమి సమావేశానికి టీడీపీ అధినేత చంద్రబాబు అధ్యక్షత వహిస్తారు. బీజేపీ తరపున రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హాజరవుతున్నారు. జనసేన నుంచి అధినేత పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోతున్నారు. ఆయన భుజం నొప్పి కారణంగా ముంబై ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. దాంతో జనసేన నుంచి సీనియర్ నాయకుడు నాదెండ్ల మనోహర్ ఈ సమావేశానికి హాజరవుతారు అని అంటున్నారు. ఈ మూడు పార్టీలు కూడా తొందరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చిస్తారు అని అంటున్నారు.

**అక్టోబర్‌లో జరిగే చాన్స్ :** ఇక ఏపీలో ప్రస్తుతం సర్ ప్రక్రియ సాగుతోంది. ఇది ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తి అవుతుంది. దాంతో ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే లోకల్ బాడీస్ కి ఎన్నికలు పెట్టాలని సూత్రప్రాయంగా కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో సమయం చూస్తే గట్టిగా రెండు నెలలు మించి లేకపోవడంతో ఇప్పటి నుంచే గ్రౌండ్ లో ప్రిపరేషన్ అవసరం అని కూటమి పెద్దలు భావిస్తున్నారు. అంతే కాదు ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారు, ఏప చోట్ల ఎవరు పోటీ చేయాలి, సీట్ల సర్దుబాటు వంటివి కూడా ఈ సందర్భంగా ప్రాథమికంగా చర్చిస్తారు అని అంటున్నారు. మూడు పార్టీలకు చెందిన ద్వితీయ తృతీయ శ్రేణి నాయకులతో పాటు పార్టీ క్యాడర్ అంతా ఒక్క త్రాటి మీద ఉండాల్సిన అవసరాన్ని కూడా ఈ సమావాశంలో చర్చిస్తారు అని అంటున్నారు. 2024 ఎన్నికల ఫలితాలు నూరు శాతం పునారావృత్తం అయ్యేలా మూడు పార్టీల అధినాయకత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయిస్తారు అని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## హెచ్ఎండీఏ సీఈని అరెస్ట్ చేసిన ఏసీబీ..

### భారీగా స్థిర, చరాస్తుల గుర్తింపు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ (సీఈ) బచ్చు రవీందర్‌ను ఏసీబీ అరెస్ట్ చేసింది. గచ్చిబౌలిలోని సుమధుర టవర్స్‌లోని ఆయన నివాసంతో పాటు హైదరాబాద్, నిజామాబాద్‌లోని 10 ప్రాంతాల్లో ఉదయం నుంచి అధికారులు సోదాలు చేశారు. రవీందర్ పేరిట భారీగా స్థిర,చరాస్తులను ఏసీబీ గుర్తించింది. బచ్చు రవీందర్‌కు మసీద్ బండలో 4 అంతస్తుల భవనం, కొండకల్, కిష్టాపూర్, పసమల ప్రాంతాల్లో రూ.39లక్షల విలువ చేసే 5 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. నానక్‌రామ్‌గూడలో రూ.2.07 కోట్లు విలువ చేసే 4 ఫ్లాట్లు, కొత్తూరు వద్ద 4 ఎకరాల వ్యవసాయ భూమి, మోకిలలో రూ.1.33 కోట్ల విలువ చేసే విల్లా ఉన్నట్లు అధికారులు నిర్ధరించారు. రవీందర్ నివాసంలో కిలోన్నర బంగారం, 12.5 కిలోల వెండి, ఇంట్లో రూ.4లక్షల నగదు, 18 విదేశీ మద్యం బాటిళ్లు సోదాల్లో లభ్యమయ్యాయి. బ్యాంకు ఖాతాల్లో రూ.45.05లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వీటి విలువ రూ.9.24 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఈ విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## పల్నాడు జిల్లాలో విషాదం..

### విగతజీవులుగా తల్లి, ఇద్దరు చిన్నారులు



**వినుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ కలహాలు, అదనపు కట్నం వేధింపులు ఓ నిండు సంసారంలో ఘోర విషాదాన్ని నింపాయి. వినుకొండ మండలం విఠంరాజుపల్లి గ్రామంలో ఇంట్లో తల్లితో పాటు ఇద్దరు పసిపిల్లలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన భారతి (24)కి నక్కా సునీల్ రెడ్డితో 2019లో వివాహమైంది. వీరికి తేజేష్ రెడ్డి (6), హేమనాథ నాగిరెడ్డి (4) కుమారులు ఉన్నారు. అయితే పెళ్లైన నాటి నుంచి కట్నం కోసం భర్త, అత్తమామలు భారతిని తీవ్రంగా వేధిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి భారతితో పాటు ఇద్దరు చిన్నారులు ఇంట్లో విగతజీవులుగా పడిఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని వినుకొండ సీఐ ప్రభాకర్ రావు పరిశీలించారు. మంచంపై ఉన్న ఇద్దరు పిల్లలను ఊపిరాడకుండా చేసి చంపినట్లు తెలుస్తోందని, భారతి ఉరివేసుకున్న స్థితిలో కనిపించిందని సీఐ తెలిపారు. బాధితురాలి మేనమామ నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం ఏడేళ్ల లోపు పిల్లలు అనుమానాస్పద స్థితిలో మరణిస్తే ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలోనే విచారణ జరగాల్సి ఉండటంతో వినుకొండ తహసీల్దార్ సురేష్ నాయక్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతుల బంధువులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ రికార్డ్ చేసుకుని, తదుపరి దర్యాప్తు కోసం పోలీసులకు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో పంచనామా ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం మృతదేహాలను వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే ఇది ఆత్మహత్యా లేక ఎవరైనా చంపేశారా అనేది సాంకేతికంగా నిర్ధరణ అవుతుందని పోలీసులు వెల్లడించారు. ఒకే కుటుంబంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో విఠంరాజుపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

**నా చెల్లి ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదు: భారతి అన్న**

ఈ ఘటనపై భారతి కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇది ముమ్మాటికీ ఆత్మహత్య కాదని, భర్త సునీల్ రెడ్డి, అతని తల్లిదండ్రులే పక్కా పథకం ప్రకారం విషప్రయోగం చేసి ముగ్గురినీ దారుణంగా హత్య చేశారని వారు ఆరోపణలు చేశారు. ఘటన స్థలంలో లభ్యమైన సూసైడ్ లేఖపై మృతురాలి అన్న యర్రం తిరుపతి రెడ్డి స్పందిస్తూ.. ఆ లేఖలో ఉన్న రాత తన చెల్లి భారతిది ఎంతమాత్రం కాదని, ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని స్పష్టం చేశారు. ముందే ముగ్గురినీ చంపేసి, ఆపై తప్పుదారి పట్టించేందుకు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, మృతదేహాలకు పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిన అనంతరం అధికారులు బంధువులకు అప్పగించారు.

వాహనం ఢీకొని.. జాగింగ్ చేస్తున్న

## హెడ్‌కానిస్టేబుల్ మృతి



**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** జాగింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందిన ఘటన కర్నూలు నగరం లో చోటుచేసుకుంది. ఏపీఎస్పీ రెండో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ రెడ్డి తెల్లవారుజామున బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న జాతీయ రహదారిపై జాగింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో అటుగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం కానిస్టేబుల్ ను ఢీకొంది. దీంతో వరప్రసాద్ రెడ్డి ఫ్లైఓవర్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావ హత్య కేసులో ప్రధాన నిందితుడు..

## కుటుంబంతో సహా ఆత్మహత్య



**సింగరాయకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి కుటుంబంతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కుడుముల హరికృష్ణ అనే వ్యక్తి.. తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండల వ్యవసాయాధికారి ఎన్. శ్రీహరి హత్య కేసులో హరికృష్ణ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. పరారీలో ఉన్న అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సింగరాయకొండ రైల్వేస్టేషన్‌కు భార్యాపిల్లలతో కలిసి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. హరికృష్ణ జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా అతడిని పోలీసులు గుర్తించారు.

**హత్య కేసు నేపథ్యమిదీ..**

జూన్ 15న బుచ్చిరెడ్డిపాళెం మండల వ్యవసాయాధికారి శ్రీహరిని తన బావమరిది హరికృష్ణ కారులో పెంచలకోనకు తీసుకెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో శ్రీహరి మృతిచెందారు. గుండెపోటుతో చనిపోయినట్లు చిత్రీకరించారు. ఆయన శరీరంపై గాయాలున్నట్లు మృతుడి బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ మాతంగి శ్రీనివాసరావు పరిశీలించి వెళ్లిపోయారు. కేసు నమోదుగానీ, అనుమానితులను విచారించడంగానీ చేయలేదు. తన భర్త హత్యకు గురయ్యారని శ్రీహరి భార్య లావణ్య పీజీఆర్ఎస్‌లో జులై 6న ఫిర్యాదుచేశారు. దీనిపై ఎస్పీ అజిత.. విచారణ చేయాలని డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును ఆదేశించారు. కుక్కలను చంపే ఇంజెక్షన్లు ఇచ్చి బావమరిది హరికృష్ణ.. ఆస్తికోసం శ్రీహరిని చంపేసినట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. ఇదే కేసులో పోలీసుల నిర్లక్ష్యంపై బుచ్చిరెడ్డిపాళెం పీఎస్‌లోని సిబ్బంది 23 మందినీ ఒకేసారి జిల్లా ఎస్పీ బదిలీ చేశారు. సీఐను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వీఆర్‌కు పంపిస్తూ ఆదేశాలిచ్చారు.




**కాకినాడ (విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్):**

కాకినాడ నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ప్రాంగణంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో భారీ మోసం వెలుగుచూసింది. కంచే చేను మేసిన చందంగా.. ఖాతాదారుల బంగారానికి రక్షణ కల్పించాల్సిన అప్రైజరే చేతివాటం ప్రదర్శించాడు. బ్యాంకులో తాకట్టు పెట్టిన ఖాతాదారులను నట్టేట ముంచుతూ దాదాపు రూ. కోటి విలువైన అసలు బంగారాన్ని మాయం చేసి, వాటి స్థానంలో నకిలీ నగలను ఉంచి ఘాతుకానికి పాల్పడ్డాడు.

**పథకం ప్రకారమే స్వాహా..**

పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ రూరల్ చీడిగకు చెందిన నవర సూరిబాబు గత కొన్నేళ్లుగా ఈ బ్రాంచ్‌లో గోల్డ్ అప్రైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జీజీహెచ్ ప్రాంగణంలోనే బ్యాంకు ఉండటంతో, అత్యవసర ఆర్థిక అవసరాల నిమిత్తం ఆసుపత్రికి చెందిన పలువురు వైద్యులు, నర్సులు, మినిస్టీరియల్ ఉద్యోగులు తదితర ఖాతాదారులు ఇక్కడ తమ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. సాధారణంగా ఖాతాదారులు తెచ్చిన బంగారాన్ని పరీక్షించి, మేనేజర్ సమక్షంలో లాకర్‌లో భద్రపరచడం అప్రైజర్ సూరిబాబు విధి. అయితే, ఈ ప్రక్రియలో అధికారుల కళ్లుగప్పి అసలు బంగారాన్ని కాజేసి, అచ్చం వాటిలాగే ఉండే నకిలీ ఆభరణాలను లాకర్లలో పెడుతూ వచ్చాడు.

**వెలుగులోకి వచ్చిందిలా..**

ఇటీవల కొంతమంది ఖాతాదారులు తమ రుణాలు పూర్తిగా చెల్లించి బంగారం వెనక్కి తీసుకునేందుకు బ్యాంకుకు రాగా అప్రైజర్ బండారం బయటపడింది. సూరిబాబు ఖాతాదారులకు వారి నగలు తిరిగి ఇవ్వకుండా పొంతనలేని సమాధానాలు చెబుతూ రోజుల తరబడి కాలయాపన చేశాడు. దీనితో అనుమానం వచ్చిన ఖాతాదారులు అతడిని గట్టిగా నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో, అప్రైజర్ తీరుపై అనుమానం వచ్చిన బ్యాంక్ అధికారులు రికార్డులను, లాకర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

**షాకింగ్ నిజాలు..**

ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. రికార్డుల ప్రకారం లాకర్‌లో ఉండాల్సిన 789 గ్రాముల బంగారానికి బదులుగా.. కేవలం 589 గ్రాముల బంగారమే ఉంది. పైగా ఆ లాకర్‌లో ఉన్న ఆభరణాలు కూడా నకిలీవని తేలడంతో అధికారులు, కస్టమర్లు తీవ్ర విస్మయానికి గురయ్యారు.

**రంగంలోకి పోలీసులు..**

నమ్మిన బ్యాంకే మోసం చేయడంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ కుంభకోణంపై బ్యాంక్ మేనేజర్ ఇడియాల నరసింహ భాను అభిరామ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ వన్ టౌన్ (ఒకటో పట్టణ) పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు, అప్రైజర్ నవర సూరిబాబును ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కుంభకోణంలో ఇంకా ఎవరి హస్తమైనా ఉందా? కాజేసిన అసలు బంగారాన్ని ఎక్కడ దాచాడు? తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY




www.viswamvoice.com
సత్యం • సమగ్రం • సమాజ బద్ధత
www.viswamvoice.com

# బెల్ట్ షాపుల్లో మందుబాబుల జేబులకు భారీగా చిల్లులు.

- ఉన్నది రెండు మాసాలే యదేచ్ఛగా దోచే..
- గ్రామాల్లో జోరుగా బెల్ట్ షాపులు




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో అహర్నిశలు శ్రమిస్తున్న శ్రామికులు రాత్రి అయితే పెగ్ చేస్తే గాని ముద్ద దిగని పరిస్థితి. కోరుకొండ మండలంలోని వైన్ షాపుల్లో ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు మందుబాబులు గోగోలు పెడుతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో గుడి, బడి, జాతీయ రహదారి అన్న బేధాలు లేకుండా మందు బాబులకు సౌకర్యమే లక్ష్యంగా కోటర్ బాటిల్ కు 30రూపాయలు అదనంగా వసూలు చేస్తూ సమయ భావం లేకుండా చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా యదేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీంతో యువత మద్యం మత్తుకు బానిసై తమ బంగారు భవిష్యత్తును చేజేతులా పాడు చేసుకుంటున్నారు. మరోపక్క రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ యువత మత్తుకు దూరంగా ఉండాలన్న ఉద్దేశంతో గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని, బెల్ట్ షాప్ విక్రయిదారులకు, ఎక్సైజ్ శాఖకు గట్టిగా హెచ్చరిక జారీ చేశారు. అయినా ఆయన ఆదేశాలను సైతం తుంగలోకి తొక్కి, అధిక రేట్లకు యదేచ్ఛగా విక్రయిస్తున్న ఎక్సైజ్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. సిండికేట్లకు సమయం రెండు మాసాలలో ముగియడంతో ఎక్కడికక్కడ అధిక ధరలకు జోరుగా విక్రయిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ లాభాలే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖ అటు ప్రభుత్వానికి, ఇటు సిండికేట్ కి మధ్య అడ్డ కత్తెరలో పోకచెక్క చందనంగా నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ బెల్ట్ షాపులపై నామమాత్రం కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా ఎక్సైజ్ శాఖ బెల్ట్ షాపులపై కఠినంగా వ్యవహరించకపోతే స్థానిక సంస్థల లోపు యువతతో సహా చాలామంది తీవ్ర అనారోగ్యంపాలు కాక తప్పదని చెప్పక తప్పదు.

# ప్రతిభగల విద్యార్థులకు పూర్వ విద్యార్థుల ప్రోత్సాహం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రస్తుత పాఠశాలలో చదువుతున్న ప్రతిభగల విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అంద చేయడం జరిగిందని ఆ బ్యాచ్ ప్రతినిధి మల్లిపూడి శివాజి తెలిపారు.. పది ఫలితాల్లో మొదటి మూడు ర్యాంకు విద్యార్థులకు, ఆరో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు మొదట ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వి విజయ లక్ష్మి, కె రాణి, కె వెంకట రమణ, వి శ్రీనివాస్, జె రవికృష్ణ కుమార్, జి సూర్యనారాయణ, ఎల్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని

# అభినందించిన టీకే విశ్వేశ్వర రెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది రాజ మండ్రి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని రాజ మహేంద్రి విద్యాసంస్థల చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ ఇంచార్జ్ టీకే విశ్వేశ్వరరెడ్డి అభినందించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమం లో ఆయన పాల్గొని రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోతా విజయ సారథి, కార్యదర్శి గండ్రోతు వేణుగోపాల స్వామి (గోపి) ఇతర కార్యవర్గ సభ్యులకు పూలమాలలు వేసి దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల సంక్షేమానికి అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని.. అందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. పాలకమండలి సరైన కార్యాచరణతో ముందుకు సాగుతూ రాజమండ్రి ప్రెస్ క్లబ్ కీర్తి ప్రతిష్టలను రాష్ట్రస్థాయిలో మరింతగా ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. సంయుక్త కార్యదర్శి కృపానందం, ఆకుల ఈశ్వర్ కొట్టే మధు, పాలపర్తి శ్రీనివాస్, ఆర్‌వివి సత్యనారాయణ చంటిబాబు తదితరులు పాల్గొన్నారు

**ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సత్కారం..**

ప్రెస్ క్లబ్ నూతన పాలకవర్గం అధ్యక్షులు మోతా బాల విజయ సారధి, కార్యదర్శి గోపి, సంయుక్త కార్యదర్శి కృపానందం ఇతర సభ్యులను రాజమండ్రి నగర పరిధిలో గల ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వీడియో జర్నలిస్టులు శాలువాలతో సత్కరించారు. పూల మాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీవీ9 సత్య, ఎన్టీవీ శ్రీనివాస్, ఏబీఎన్ కెమెరామెన్ సతీష్, ఎన్టీవీ కెమెరామెన్ వాసు, సి ఛానల్ కెమెరామెన్ వీరబాబు, టీవీ9 రసూల్, బాలు, భూషణం, రామకృష్ణ(ఆర్ కే), ఈటీవీ ప్రకాశ్, మహా టీవీ ఆనంద్ తదితరులు ఉన్నారు.

# క్రమశిక్షణే విజయానికి మూలం... ఆంధ్రకేసరి ధైర్యం ఆదర్శం

**ఆంధ్రకేసరి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి - గంజాయి... అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి**

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి... ఎమ్మెల్సీ సోము - జెఎన్ రోడ్డులోని ఏకేసి వద్ద ఆంధ్రకేసరి విగ్రహావిష్కరణ**

**అనంతరం "మీ భద్రత - మా బాధ్యత" కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చైతన్య సందేశం... - క్రమశిక్షణ.. విద్య.. మహిళల భద్రత.. చట్టాలపై పోలీసులు అవగాహన**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రమ శిక్షణ... ధైర్యం... దేశభక్తి అనే విలు వలతో జీవించిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపు నిచ్చారు. నేటి యువత గంజాయి, మాదక ద్రవ్యాలు, అసాంఘిక శక్తులకు పూర్తిగా దూరంగా ఉండి విద్య, వ్యక్తిత్వ వికాసం, సమాజ సేవ వైపు అడుగులు వేయా లని వారు సూచించారు. క్రమశిక్షణే విజయానికి మూలమని, ఆంధ్రకేసరి చూపిన ధైర్యసాహసాలు ప్రతి యువకుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జేఎన్ రోడ్డులోని ఆంధ్రకేసరి (ఏకేసి) కళాశాలలో నిర్వహించిన "మీ భద్రత - మా బాధ్యత" కార్యక్రమం విద్యార్థుల్లో చైతన్యం నింపింది. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పోలీసు అధికారులు, ఈగల్ టీం ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన, మహిళల భద్రత, గంజాయి వంటి మత్తు పదార్థాల ప్రమాదాలు, క్రమశిక్షణ, విద్య ప్రాధాన్యతపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... విద్యార్థి దశలో రాజకీయాలకు దూరంగా ఉండి చదువుపైనే పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు. రాజకీయ సభలకు విద్యార్థులను తీసుకురావడం తనకు ఇష్టం ఉండదని, కానీ మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించే ఇలాంటి కార్యక్రమాలకు మాత్రం తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలని, బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి "ఆంధ్రకేసరి" బిరుదు పొందిన మహానుభావుడి పేరుతో నామకరణం చేసిన కళాశాల ఎదుట ఆయన విగ్రహం ఉండటం సముచితమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అక్కడ వేరే దానిని ఏర్పాటు చేయడం చారిత్రకంగా తప్పు నిర్ణయమని విమర్శించారు. ఇప్పుడు ఆ తప్పును సరిదిద్దుతూ ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చరిత్రకు జరిగిన న్యాయమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి మంచి స్నేహితులను ఎంచుకోవాలని, చెడు అలవాట్లు, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లలపై తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాలని, ఒక్కరి తప్పిదం సమాజంలోని అనేక మంది బాలికల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. నగరంలో శాంతిభద్రతలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గత రెండేళ్లలో వంద మందికి పైగా రౌడీషీట్లు తెరిచామని తెలిపారు. తప్పు చేసిన వారిపై రాజకీయాలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించే వారెవ్వరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. విద్య పూర్తయ్యాక ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే భారీ పరిశ్రమలు, కంపెనీలు తీసుకొస్తున్నామని చెప్పారు. వందేళ్లుగా చెన్నైలోనే తయారవుతున్న రాయల్ ఎన్ఫీల్డ్ తయారీ యూనిట్‌ను తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా రెండు ప్రశ్నలు అడుగుతారని... "ఏం చదివావు?", "ఎక్కడి నుంచి వచ్చావు?" అని... అందుకే చదువు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జన్మభూమిని ఎప్పటికీ మరవొద్దని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు చెప్పిన "తల్లికి చెప్పుకోలేని పనులు ఎప్పుడూ చేయొద్దు" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి జీవితంలో ఆచరించాలని కోరారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ... దేశాభివృద్ధికి క్రమశిక్షణే మూలమని అన్నారు. ఒకప్పుడు ప్రపంచానికి తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలను అందించిన గొప్ప నాగరికత మనదని, మహాబలిపురం వంటి వేల ఏళ్ల చరిత్ర కలిగిన నిర్మాణాలు భారత ప్రతిభకు నిదర్శనమని చెప్పారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యం, నిజాయితీ, నాయకత్వం, ప్రజాసేవకు ప్రతీక అని వివరించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల అవసరాల కోసం వెంటనే నిర్ణయాలు తీసుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. అలాంటి మహానుభావుడి పేరుతో ఉన్న కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా అదే ధైర్యం, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తన విద్యార్థి దశలో భీమవరం వరకు సైకిల్‌పై ప్రయాణిస్తూ చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. నేటి విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కాగా ఈగల్ టీం ఇన్‌చార్జ్ మోహనరావు, దిశ పోలీస్ ఎస్ఐ మంగాదేవి, ప్రకాశం నగర్ సీఐ బాజిలాల్ తదితరులు మాట్లాడుతూ... మహిళల భద్రత, సైబర్ నేరాలు, ఈగల్ టీంల సేవలు, చట్టపరమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నగరంలో ఇప్పటివరకు 5 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మత్తు పదార్థాలపై రాజీపడని విధానంతో పోలీసులు పనిచేస్తున్నారని, యువత గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

**ఘనంగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహావిష్కరణ**

జేఎన్ రోడ్డులోని ఆంధ్రకేసరి (ఏకేసి) కళాశాల జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఆంధ్రకేసరి యువజన సమితి ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, ప్రముఖులతో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి "ఆంధ్రకేసరి" బిరుదు పొందిన మహానేత చరిత్రను భావితరాలకు చేరవేయాలంటే ఇలాంటి విగ్రహాలు, స్మారక చిహ్నాలు అవసరమని పేర్కొన్నారు. ఏకేసి కళాశాల పేరు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు పేరిట ఉండటంతో, కళాశాల ఎదుట ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం చారిత్రకంగా సముచిత నిర్ణయమని అభిప్రాయపడ్డారు. మహానేత ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ధైర్యం, నిజాయితీ, దేశభక్తి, ప్రజాసేవతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆంధ్రకేసరి యువజన సమితి సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్స్ పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని నున్న ప్రశాంతి ఆధ్వర్యంలో "విద్యా మిత్ర స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎస్ఎంసి చైర్మన్ గెద్దాడ వెంకటకృష్ణ, వైస్ చైర్మన్ ఎలుగుబంటి దుర్గారావు చేతులమీదుగా విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు కె. దుర్గా ప్రసాద్, బేబీ, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు గోడిసి పూడి నాగేంద్ర బాబు, జనసేన పార్టీ కార్యదర్శి శీలం సురేష్ కుమార్, టిడిపి గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి చౌడాడ లాజర్, టిడిపి వైస్ ప్రెసిడెంట్ ఎర్ర రాంబాబు, టిడిపి నాయకులు టి.సుబ్బయ్య, బిజెపి పార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు మన్యం శ్రీను, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు
VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.





### బీసీలను అవమానించిన

# చిర్ల జగ్గిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

## మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర ఆగ్రహం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రిని విమర్శించే క్రమంలో బుడబుక్కలోడు అనే పదాన్ని పదే పదే ఉపయోగిస్తూ సంచార జాతులకు చెందిన బీసీ వర్గాలను అవమానించడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. బీసీలను కించపరిచేలా మాట్లాడటం వైసీపీ నాయకుల అసలు మనస్తత్వానికి నిదర్శనమని, కుల అహంకారంతో వెనుకబడిన వర్గాలను అవహేళన చేసే రాజకీయాలను ప్రజలు ఎన్నడూ క్షమించరని హెచ్చరించారు. కోనసీమ జిల్లాలో కుల విద్వేషాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిపై చట్టప్రకారమే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గతంలో బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఇప్పుడు అదే బీసీ సమాజాన్ని అవమానించడం అత్యంత హేయమైన చర్య అని, ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి మాట్లాడుతూ బీసీ వర్గాలను హీనంగా చూపించే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ జగ్గిరెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుంటే, వైసీపీ మాత్రం వాస్తవాలను వక్రీకరిస్తూ విష ప్రచారం చేస్తోందని విమర్శించారు. ముమ్మిడివరం చెయ్యేరు చెరువు అభివృద్ధికి ప్రభుత్వం రూ.17.74 కోట్లు మంజూరు చేసినప్పటికీ, నిధులు ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. వెనుకబడిన తరగతుల రాష్ట్ర కన్వీనర్ పెంద్ర రమేష్ మాట్లాడుతూ బీసీలను అవమానించిన జగ్గిరెడ్డి వెంటనే బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సంచార జాతుల్లోని కళాకారులను అవమానించడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సముచిత గౌరవం, అవకాశాలు లభించాయని అన్నారు. బీసీ నాయకులుగా చెప్పుకునే మాజీ ఎంపీ సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ ఈ అంశంపై పక్కన ఉండి మౌనం పాటించడం కూడా బీసీ సమాజాన్ని అవమానించినట్లేనని, వారిద్దరూ కూడా బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పళ్ళం రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లి బోస్ గురించి మాట్లాడే స్థాయి మీది కాదు

## వ్యాఖ్యలను వక్రీకరించడం దుర్మార్గం - అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దు
## రైతులకు ఎటువంటి హామీ ఇవ్వని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే కులాల మధ్య చిచ్చు పెడతారా
## బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు పెద్దపీటవేసే జగ్గిరెడ్డిపై విమర్శలా



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో కొత్తపేట నియోజకవర్గ బీసీ నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి చేసిన వ్యాఖ్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి బీసీ వర్గాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. రైతులకు, ముఖ్యంగా యూరియా కొరత, ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయనే ఆకాంక్షతో చేసిన వ్యాఖ్యలను కులాలకు ఆపాదించడం పూర్తిగా దురుద్దేశపూర్వక ప్రచారమని పేర్కొన్నారు. హిందూ సంప్రదాయంలో సంక్రాంతి సందర్భంగా వచ్చే హరిదాసులు, గంగిరెడ్లు, బుడబుక్కల వారు ఆశీర్వాదాలు అందించే సందర్భాన్ని మాత్రమే ఉదాహరణగా జగ్గిరెడ్డి ప్రస్తావించారని, ఎలాంటి సామాజిక వర్గాన్ని కించపరిచే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. బీసీల సంక్షేమం గురించి మాట్లాడే ముందు తెలుగుదేశం పార్టీ తమ పాలనలో వెనుకబడిన వర్గాలకు చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చరిత్రలో తొలిసారిగా బీసీ వర్గానికి చెందిన నాయకుడికి ఛైర్మన్ పదవి ఇవ్వడం, చిన్న స్థాయి కార్యకర్తలను ఉన్నత పదవులకు తీసుకురావడం సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. కులాలు, మతాల మధ్య వైఎస్సార్‌సీపీ చిచ్చు పెడుతుందనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, అన్ని వర్గాలను సమాన దృష్టితో ఆదరించి రాజకీయంగా ప్రోత్సహించిన నాయకుడు చిర్ల జగ్గిరెడ్డి గారేనని అన్నారు. ప్రజల అసలు సమస్యలను పక్కనబెట్టి రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారాలు చేసే వారిని ప్రజలు నమ్మరని, బీసీల పేరుతో చౌకబారు రాజకీయాలు మానుకుని రైతుల సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార పార్టీ దృష్టి పెట్టాలని అలాగే వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యత్వాల నుంచి నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, స్థానిక సంస్థల వరకు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు అపూర్వమైన రాజకీయ ప్రాధాన్యం కల్పించిందని కొత్తపేట నియోజకవర్గ బీసీ నాయకులు అన్నారు.

# కొబ్బరి పీచు ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం

## రైతులు, మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు వ్యాపార అవకాశాలపై అవగాహన
## జూలై 16, 17 తేదీల్లో 'కోనసీమ కోయిర్ కాంక్లేవ్-2026' విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ నెల 16, 17 తేదీల్లో అనాతవరం వేదిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న కోనసీమ కోయిర్ కాంక్లేవ్-2026ను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి లైజనింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కోయిర్ పరిశ్రమల అభివృద్ధి, కొబ్బరి పీచు ఆధారిత పరిశ్రమల స్థాపన, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించేందుకు ఈ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమ ఏర్పాట్లు, వర్క్‌షాప్ నిర్వహణ, శాఖల సమన్వయంపై అధికారులు, బ్యాంకర్లు, ఏపీఐఐసీ, కోయిర్ బోర్డు, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. కేరళ నుంచి కోయిర్ పరిశ్రమల నిపుణులు, శాస్త్రవేత్తలను ఆహ్వానించి స్థానికంగా ఉన్న అవకాశాలు, ఆధునిక సాంకేతికత, పరిశ్రమల నిర్వహణపై ఔత్సాహికులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రాయితీ పథకాలు, బ్యాంకు రుణాలతో సమన్వయం చేసి మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలు, రైతులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో కొబ్బరి సాగు విస్తారంగా ఉన్నందున ముడి సరుకును మాత్రమే విక్రయించకుండా, దాని నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఉద్యానవన, మార్కెటింగ్, పరిశ్రమల శాఖలు పరస్పర సమన్వయంతో వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు. కొత్త పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, ముద్రా, పీఎంఈజీపీ తదితర రుణాల మంజూరులో బ్యాంకర్లు సహకరించాలని సూచించారు. వర్క్‌షాప్‌లో బ్యాంకులు, ఉద్యానవన శాఖ, కోయిర్ బోర్డు, కోయిర్ హస్తకళలు, ఎంఎస్ఎంఈ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి సందర్శకులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి కేటాయింపులు, మౌలిక వసతుల కల్పనపై ఏపీఐఐసీ అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. కోయిర్ బోర్డు నిపుణులు ఆధునిక సాంకేతికతపై, మార్కెటింగ్ శాఖ అధికారులు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలపై ఔత్సాహికులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే గత ఐదేళ్లుగా జిల్లా నుంచి మార్కెటింగ్ అవుతున్న కొబ్బరి ఉత్పత్తుల వివరాలను సేకరించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ రాధామణి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవ వర్మ, కోయిర్ బోర్డు సహాయ అధికారి పవన్ కిరణ్, కోయిర్ బోర్డు ప్రాంతీయ అధికారులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.వి. రమణ, మార్కెటింగ్ శాఖ అధికారి కె. విశాలాక్షి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### ముద్రగడ పద్మనాభం మృతి రాష్ట్ర రాజకీయాలకు

# కాపు సమాజానికి తీరని లోటు : తోట త్రిమూర్తులు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. హైదరాబాద్ నుంచి మీడియాతో మాట్లాడిన ఆయన ముద్రగడ పద్మనాభం మరణం రాష్ట్ర రాజకీయాలకు మాత్రమే కాకుండా, కాపు సామాజిక వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. కాపు సమాజం హక్కులు, సంక్షేమం, అభ్యున్నతి కోసం జీవితాంతం నిరంతర పోరాటం చేసిన నాయకుడిగా ముద్రగడ పద్మనాభం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. కాపు సమాజానికి మార్గదర్శిగా క్లిష్ట పరిస్థితుల్లో ఆశాకిరణంగా నిలిచిన నాయకుడి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. ముద్రగడ పద్మనాభం చేసిన సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్న తోట త్రిమూర్తులు, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# గోడి బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానం



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలంలోని గోడి గ్రామంలో గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను వివిధ తరగతులలో మిగిలివున్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. 5వ తరగతిలో మొత్తం 45 సీట్లు ఖాళీగా ఉండగా, అందులో సాధారణ వర్గానికి ఒక సీటు, షెడ్యూల్డ్ కులాల వర్గానికి 44 సీట్లు కేటాయించారు. అలాగే 6వ తరగతిలో 25 సీట్లు, తొమ్మిదవ తరగతిలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి, ఇవన్నీ కూడా పూర్తిగా షెడ్యూల్డ్ కులాల వర్గానికి చెందిన విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విభాగానికి వస్తే, గణిత, భౌతిక, రసాయన శాస్త్రాల విభాగంలో 5 సీట్లు, జీవ, భౌతిక, రసాయన శాస్త్రాల విభాగంలో పది సీట్లు ఖాళీగా ఉన్నాయి, ఈ రెండు విభాగాలలోని సీట్లు కూడా పూర్తిగా షెడ్యూల్డ్ కులాల వర్గానికి కేటాయించబడ్డాయి. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16వ తేదీ లోగా అవసరమైన కుల, ఆదాయ విద్యా ధృవీకరణ పత్రాలతో నేరుగా విద్యాసంస్థకు విచ్చేసి తమ ప్రవేశాలను స్థిరీకరించుకోవాలని, ఆ గడువు ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశాలు కల్పించబడవని కళాశాల ప్రధానాచార్యులు ఎన్. శ్రీనివాసు ఒక ప్రకటనలో వెల్లడించారు. మరింత సమాచారం కోసం పాఠశాల మరియు కళాశాల కార్యాలయంలో కానీ, లేదా బాధ్యత గల ఉపాధ్యాయులను కానీ సంప్రదించవచ్చు.

# "సర్" ప్రోగ్రామ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని మున్సిపల్ 2వ వార్డు నందు "సర్" ప్రోగ్రాంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఒంటెద్దు బాబి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎల్వో,బిఎల్ఏలతో కలిసి ఓటర్లకు "సర్"యొక్క విధివిధానాలను తెలియజేశారు. ఎలక్షన్ కమిషన్ ఈ ప్రోగ్రామును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినందుకు కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఓటరుకు సరైన సేవ అందించటం" సర్ "కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం ఓటర్లకు అందిస్తున్న సేవలను, వారి యొక్క సమస్యల పరిష్కారము, దరఖాస్తులు స్వీకరణ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలోని పాల్గొని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే అంశాలపై విస్తృతంగా చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వడ్డీ నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మాచవరపు శివన్నారాయణ, అమలాపురం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలేశ్వరం రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు మహబూబ్ షకీలా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేవరపల్లి రాజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ ప్రతిభ కనబరిచిన మాస్టర్ పెసింగ్

# సచిన్‌ను సత్కరించిన ఎమ్మెల్యే గిడ్డి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి. గన్నవరం మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో "ది ఇన్ఫినిట్ హ్యూమన్ క్యాలెండర్ - జీనియస్ కాల్క్యులేటింగ్ ఏనీ డే అక్రాస్ బిలియన్స్ ఆఫ్ ఇయర్స్" అవార్డు గెలుచుకుని విశేష ప్రతిభ కనబరిచిన మాస్టర్ పెసింగ్ సచిన్ను పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం కోనసీమ జిల్లాకే గర్వకారణమని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే అసాధారణ మేధస్సుతో అరుదైన ఘనత సాధించిన మాస్టర్ సచిన్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ పుట్టినరోజు వేడుకలు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్:** ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, వైసీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ టిటిడి బోర్డు మెంబర్ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ ఆఫీసులో స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీ వల్లభుని దొరబాబు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి పొన్నాడ సతీష్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలను కొనియాడుతూ, ఆయన నిరంతరం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నేతలు ఆకాంక్షించారు. అనంతరం సేవా దృక్పథంతో ముమ్మిడివరం గవర్నమెంట్ హాస్పటల్ నందు చికిత్స పొందుతున్న రోగులకు పళ్ళు, బ్రెడ్, పాలు అందించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సేవా కార్యక్రమంలో ముమ్మిడివరం ఎంపీపీ కోలా బాబ్జి, కాట్రేనికోన జడ్పీటిసి నేల కిషోర్, కోన వెంకట శ్రీనివాసరావు, కాశి రామకృష్ణ, రాయపురెడ్డి జానకిరామయ్య, సత్తిబాబు, వేటుకూరి బోస్ రాజు, రెడ్డి శివన్నారాయణ, దొమ్మేటి అప్పారావు, నాట్ర వీర్రాజు, రామకృష్ణ రాజు, కాండ్రేగుల త్రిమూర్తులు, మట్టా సత్తిబాబు, వస్త్రాల వీరన్న, కర్రీ శ్రీను, రేకాడి వర్మ, మోకా రామారావు, పులిదిండి రాజేష్, బోనం చిన్ని, తాతాజీ తదితర ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌కు

# మరో ఏడాది పదవీకాలం పొడిగింపు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.నిర్మల్ కుమార్ డిప్యూటేషన్‌ను మరో ఒక సంవత్సరం (4వ సంవత్సరం) పాటు పొడిగించింది.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా ఉన్న వి.నిర్మల్ కుమార్ డిప్యూటేషన్‌పై అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం. 897, తేదీ: 12-07-2026 ప్రకారం, ఆయన డిప్యూటేషన్‌ను 2026 మే 1 నుంచి మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ & డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

### ఉన్నత లక్ష్యాల సాధనకు

# అంకితభావంతో కృషి చేయాలి

**విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు**
**పాఠశాల నుండి కళాశాలకు వచ్చిన జూనియర్లకు ఘన స్వాగతం పలికిన సీనియర్లు**
**విద్యార్థులకు పలు సూచనలు చేసిన డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి**







**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పదవ తరగతి విద్యను పూర్తి చేసుకుని పాఠశాల నుండి కళాశాలకు ఉన్నత విద్య నిమిత్తం వచ్చిన విద్యార్థుల మనసుల లోని ఆందోళన, భయాన్ని తొలగించడానికి రాయవరం లోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సబ్బెళ్ళ అచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆద్యంతం ప్రారంభం నుండి ఆటపాటల సందడితో ఉత్సాహంగా సాగిన కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మల్లిడి అమ్మిరెడ్డి హాజరై మాట్లాడుతూ, విజ్ఞాన్ విద్యార్థులు గతంలో సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థి జీవితానికి ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకమైందని, ఈ సమయంలో క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర శ్రమతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందన్నారు. సాధారణ విద్యార్థులు మెరుపు ఫలితాలతో కళాశాలను పేరును రాష్ట్రస్థాయిలో నిలపడం గర్వకారణమని కొనియాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ అచ్చిరెడ్డి మాట్లాడుతూ, విజ్ఞాన్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం వెనుక సంస్థ అమలు చేస్తున్న పటిష్టమైన విద్యా ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, విద్యార్థుల క్రమశిక్షణ ప్రధాన కారణాలని తెలిపారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి కళాశాలకు మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో కూడిన విలువలతో, ముఖ్యంగా విద్యార్థినులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్‌పర్సన్ డా. మల్లిడి శేషవేణి సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ విద్యా, సాంస్కృతిక, క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.ఎస్.ఆర్. రూరల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సతీష్ రెడ్డి, కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్ ఇన్‌చార్జ్ డి. సుబ్బారెడ్డి, విజ్ఞాన్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. విక్రమ్ రెడ్డి, అధ్యాపక బృందం, సీనియర్, జూనియర్ విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని

## రేపు రామచంద్రపురం నుండి ద్రాక్షారామం వరకు జనసేన మహా పాదయాత్ర

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి త్వరగా రావాలని, పరిపాలన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుకుంటూ రేపు బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నుండి ద్రాక్షారామం భీమేశ్వరస్వామి ఆలయం వరకు మహా పాదయాత్ర అనంతరం ద్రాక్షారామం భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమం బుధవారం సాయంత్రం 4 గంటలకు రామచంద్రపురంలోని జనసేన పార్టీ కార్యాలయం నుండి ప్రారంభం కానుంది. కావున రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ తరపున వివిధనామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు,ప్రజాప్రతినిధులు, నాయకులు, పూర్వపు స్వచ్ఛంద సేవకులు, వీరమహిళలు, జనసైనికులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహా పాదయాత్రను విజయవంతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ కమిటీ కోరింది.

## మట్టి, ఇసుక అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ చిర్ల జగ్గిరెడ్డి

**జగన్ మెప్పుకోసమే చంద్రబాబుపై దుర్భాషలు**
**అభివృద్ధి కోసం బండారు చేస్తున్న కృషిని చూసి ఓర్వలేకే ఆరోపణలు...**
**అభివృద్ధికి బండారు చిరునామా.. అవినీతికి చిరునామా చిర్ల..**




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు నిలిపి తద్వారా సంక్షేమాన్ని,ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం నిరంతరం ఎమ్మెల్యే సత్యానందరావు పనిచేస్తుంటే చిర్ల ఓర్వలేకపోతున్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చినా, నియోజకవర్గంలో ప్రత్యేకత ఏమీ చూపలేకపోయిన చిర్ల జగ్గిరెడ్డి అసత్య ఆరోపణలు, అవాస్తవాలతో ప్రజలను మభ్య పెట్టాలనుకుంటున్నారు... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై వారు బుడబుక్కలు వాడు అంటూ మాట్లాడటం ఆయన మనస్తత్వాన్ని తెలియజేస్తుంది.. ఎదుటివారిని కించపరచడం చిర్లకు అలవాటుగా మారింది.. చిర్ల మాయ మాటలు కారణంగా మూడుసార్లు గెలిచినా రెండు, మూడు వేలు మెజార్టీ దాటలేకపోయారు...ప్రజలు ఆయన నిజ స్వరూపాన్ని గ్రహించే భారీ తేడాతో ఓడించి గుణపాఠం చెప్పారు...ఇప్పుడు జిల్లాలో కూడా తన సహచరులకు అదే ఓటమి రుచి చూపించడానికి ఆయన నడుము కట్టుకున్నారు...ఇకనైనా చిర్ల వారు చిల్లర మాటలు కట్టి పెట్టాలని కోరుతున్నాం.

### మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి

## మంత్రి సుభాష్ రూ.10 వేల ఆర్థిక సాయం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మూర్ఛ వ్యాధి (ఫిట్స్)తో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీనివాస్ కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు మంత్రి సుభాష్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. విషయాన్ని తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే శ్రీనివాస్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు కాకినాడలోని ఆసుపత్రిలో చికిత్స చేయించాలని తన వ్యక్తిగత సిబ్బందికి సూచించారు. బాధితుడికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని తక్షణ ఆర్థిక సాయం అందించిన మంత్రి సుభాష్‌కు శ్రీనివాస్ భార్య రామలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై సత్వర స్పందనతో మంత్రి సుభాష్ ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

### రావులపాలెంఫోటో గ్రాఫర్స్ యూనియన్

## నూతన కార్యవర్గం ఎన్నిక



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగినది నూతన అధ్యక్షులుగా ఎన్.మనోజ్ ట్రెజరర్‌గా నరసింహారావు సెక్రటరీగా అంబిక రాజు జాయింట్ సెక్రెటరీగా చోడే హరిచంద్ర ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్‌గా కంబాల వీరబాబు గౌరవ అధ్యక్షులుగా గుబ్బల రమణ ముత్యాలు సతీష్ చంద్ర గౌరవ సలహాదారుడు కల్లూరు సత్యనారాయణ మూర్తి సత్యనారాయణమరియు మెంబెర్స్ విష్ణు పద్మనాభం నాగిరెడ్డి నరసింహారావు అంజి వీరబాబు సత్యనారాయణ నాగరాజు సత్తిబాబు బూరయ్య దొరబాబు శ్రీను లను ఎన్ను కోవడం జరిగినదని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మూడు మండలముల ఫోటోగ్రాఫర్స్ అందరూ పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనులను

## సక్రమంగా నిర్వహించాలి

### కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో పారిశుద్ధ్య పనులు నిరంతరం సమర్థవంతంగా నిర్వహించి.. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. మంగళవారం ఉదయం ప్రజారోగ్య అధికారులతో కలిసి జీ అండ్ టీ రోడ్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య చర్యలు, రహదారుల పరిశుభ్రతను తనిఖీ చేసి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్మికులంతా ఉదయం 7 గంటల కల్లా తమకు అప్పటించిన ప్రాంతాల్లో రోడ్లను శుభ్రం చేయాలని.. తరచుగా చెత్త వేస్తున్న ప్రాంతాలను గుర్తించి స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా రోడ్ల వెంబడి, ఫుట్ పాత్‌లు, డివైడర్లలో ఎక్కడా చెత్త ఉండకూడదన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, పర్యవేక్షణ సిబ్బంది బాధ్యతగా పనిచేస్తేనే వందశాతం స్వచ్ఛతను సాధించవచ్చన్నారు. అనంతరం క్వారీ మార్కెట్ జంక్షన్ లోని అన్న క్యాంటీన్ ను సందర్శించిన ఆయన.. అక్కడి నిర్వహణ, ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఆహార సేవలను ప్రతిఒక్కరికి గౌరవప్రదంగా అందించాలని సిబ్బందికి సూచించారు. క్యాంటీన్ పరిసరాలు, త్రాగునీటి సౌకర్యాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజలు కూడా భోజన అనంతరం వ్యర్థాలను బిన్ లలో వేయవలసిందిగా సూచించారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

## పల్లిపాలెంలో పశువుల పాక అగ్నికి ఆహుతి



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం పల్లిపాలెంలో మంగళవారం కాలువను ఆనుకొని ఉన్న పశువుల పాకలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూర్తిగా దహనమైంది. కాలువ పక్కన చెత్తను తగలబెట్టగా ఒక్కసారిగా మంటలు వ్యాపించి పశువుల పాకకు చేరినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## మానవత్వం చాటుకున్న ముమ్మిడివరం కమిషనర్



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం పోలమ్మ చెరువు గట్టున అనారోగ్యంతో బాధపడుతున్న ఒక అనాథను కమిషనర్ పి.రవివర్మ మంగళవారం గుర్తించారు. వెంటనే స్పందించిన ఆయన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించి, 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. రోగి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కాకినాడ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కమిషనర్ చూపిన మానవత్వాన్ని పలువురు అభినందించారు.

## వరి కోత యంత్రాలతో సులువుగా దమ్ము పనులు!



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో వరి కోత యంత్రాలను దమ్ము యంత్రాలుగా మార్చి పనులు చేయడం ఇప్పుడు సులభతరంగా మారింది. గతంలో పెద్ద, చిన్న ట్రాక్టర్లతో దమ్ములు చేసే రైతులు.. ఇప్పుడు ఈ సరికొత్త విధానం వైపు మొగ్గు చూపుతున్నారు. కేవలం 40 నిమిషాల్లోనే ఎకరం దమ్ము పూర్త వుతుండగా, ఎకరాకు రూ.4,000 వసూలు చేస్తున్నారు. పనులు త్వరితగతిన ముగుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### చిర్ల జగ్గిరెడ్డిపై టీడీపీ నాయకుల విమర్శలు

## రాజకీయ దురుద్దేశపూరితం : పిల్లి సూర్యప్రకాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డిపై చేసిన విమర్శలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్ విమర్శించారు. మంగళవారం రామచంద్రపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పలేక, వ్యక్తిగత ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికే కట్టుబడి పనిచేసిందని, బీసీ సమాజాన్ని అవమానించే ఉద్దేశం పార్టీకి ఎప్పుడూ లేదని స్పష్టం చేశారు. అధికార పక్ష నాయకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా అనవసర రాజకీయ విమర్శలు మానుకోవాలని, ప్రభుత్వ వైఫల్యాలపై సమాధానం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, రామచంద్రపురం మండల కన్వీనర్ పోలినాటి వరప్రసాద్, నాయకులు చోడే భాను, బండి బుజ్జి, గుంటముక్కల దొరబాబు, గంగవరం మండలం బూత్ కన్వీనర్ దారా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాశక్తి విలేకరికి రూ. 25 వేల ఆర్థిక సహాయం

## అందజేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ప్రజాశక్తి రిపోర్టర్ చొప్పెల్ల దేవానందం కుటుంబ ఖర్చుల నిమిత్తం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ 25 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి స్వయంగా చెక్కు రాసి, రామచంద్రపురం నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షులు కే.ఏ. కనకరత్నం, ఏ.పీ.యూ.డబ్ల్యూ.జే జిల్లా ప్రధాన కార్యదర్శి కాటే భీమశంకరం, సంయుక్త కార్యదర్శి కే. రమేష్, ఉపాధ్యక్షులు బోడపాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంపల పృథ్వీరాజు, ఈటీవీ వెంకటరమణలకు బహూకరించారు. విలేకరి దేవానందానికి తొలుత గుండెపోటు వచ్చిన వెంటనే మంత్రి స్పందించి, బొల్లినేని ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి సర్జరీ చేయించారు. తాజాగా కుటుంబ అవసరాల కోసం నగదు సహాయం కూడా అందించి అండగా నిలిచారు. విలేకరి కుటుంబానికి సాయం చేస్తూ మంత్రి చూపిన ఔదార్యానికి రామచంద్రపురం నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అభినందనలు తెలుపుతూ, కృతజ్ఞతలు ప్రకటించారు.

## అనాథలకు సేవ చేయడంలోనే ఆత్మసంతృప్తి

### అమెరికా సంఘ సేవకులు బ్రియాన్ బెల్



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** గత 30 సంవత్సరాలుగా సిస్టర్ పెట్రీషియా అనాథ శరణాలయం ద్వారా అనాథలకు సేవ చేయడం ఎంతో ఆత్మసంతృప్తిని కలిగిస్తుందని అమెరికాకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు బ్రియాన్ బెల్ అన్నారు. వారి తల్లి పెట్రీషియా పేరు మీదుగా వెంకటాయపాలెంలో జిల్లా ప్రజా పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గ ప్రత్యేక విభాగానికి చెందిన సభ్యులు తాతపూడి ప్రసన్న విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే అనాథ ఆశ్రమం 30వ వార్షిక మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రేపు అనగా బుధవారం ఆయన అమెరికా నుంచి విచ్చేసారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని పిల్లలందరూ చదువుకుంటున్న ద్రాక్షారామ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించి, పదవ తరగతి ఫలితాల్లో సాధించిన విజయాలపై విద్యార్థులను అభినందించారు. ప్రతి తరగతి గదిని సందర్శించి అక్కడి విద్యా వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఇన్ని సదుపాయాలు ఉండటం నిజంగా అభినందనీయమని కొనియాడారు. అనంతరం పిల్లలతో మాట్లాడుతూ కష్టపడి చదవడం ద్వారానే జీవితంలో పైకి ఎదుగుతారని, అమెరికా విద్యా విధానానికి, భారత విద్యా విధానానికి పెద్దగా తేడా ఏమీ లేదని చెప్పారు. అక్కడ సాంకేతిక విద్యకు ఎంత ప్రాధాన్యత ఉందో ఇక్కడ కూడా అంతే ప్రాధాన్యత ఉందని, సాంకేతిక విద్య ద్వారానే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులకు చదువులో విజయాలు సాధించడానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గ ప్రత్యేక విభాగానికి చెందిన సభ్యులు తాతపూడి ప్రసన్న విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు పి. శేఖర్, సిబ్బంది కార్యదర్శి అరవ విస్సు, మూర్తి, ఆని శ్రీనివాస్, కళ్యాణి, మొహిద్దీన్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
బుధవారం, 15 జూలై 2026
www.viswamvoice.com



### "మన వార్డులో – మన ఆదిరెడ్డి"తో

# ప్రజాపాలనకు కొత్త నిర్వచనం

**ప్రతి హామీని నిలబెట్టాం... ఆ దిశగానే ముందుకు సాగుతున్నాం**
**అభివృద్ధి, పారదర్శకత, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "మన వార్డులో - మన ఆదిరెడ్డి" కార్యక్రమం ద్వారా ప్రజా పాలనకు కొత్త నిర్వచనం ఇస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, అక్కడికక్కడే అధికారులతో పరిష్కార చర్యలు చేపట్టించడం, అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను స్వీకరిం చడం ద్వారా ప్రజలకు చేరువైన పాలనను ఆచరణలో చూపిస్తున్నామన్నారు. గత రెండేళ్లలో రాజమహేంద్రవరం నగర అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక ముందడుగు వేసిందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ది. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రెస్ క్లబ్‌కు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మీడియాపై ప్రజలకు ఇప్పటికీ అపారమైన విశ్వాసం ఉందని, వాస్తవాలు-అవాస్తవాలను నిర్ధారించుకునేందుకు ప్రజలు ఇప్పటికీ పత్రికలు, న్యూస్ ఛానళ్లనే ఆశ్రయిస్తున్నారన్నారు. అందువల్ల మీడియా ప్రజాస్వామ్యానికి కీలక స్తంభంగా నిలుస్తోందన్నారు. ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాయని, ప్రతి బూత్ స్థాయిలో బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. సుమారు 90 శాతం డిజిటలైజేషన్ పూర్తవడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రతిపక్ష పార్టీల ఓట్లను కూడా ఎలాంటి వివక్ష లేకుండా డిజిటలైజ్ చేయడం ప్రజాస్వామ్యానికి తమ ప్రభుత్వం ఇచ్చిన గౌరవమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు విడుదల చేసిన డిక్లరేషన్లను కొందరు ఎగతాళి చేసినా, ఇప్పుడు వాటినే కార్య రూపంలో చూపిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీ మేరకు రూ.52 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రారంభిం చామని, మరో రూ.14 కోట్ల పనులు వేగంగా జరుగుతున్నాయని, రూ.28 కోట్ల ఫేజ్-1 టెండర్ దశలో ఉందన్నారు. గోదావరి గట్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రివర్‌ఫ్రంట్ పనులు వేగంగా సాగుతున్నాయని, ఫేజ్-1 నెల రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. మీడియా సూచనల మేరకు పద్మావతి ఘాట్ మరమ్మతులు, సుందరీకరణ కోసం రూ.3 కోట్లతో టెండర్లు పిలిచామని, పక్కనే రూ.100 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టు కొనసాగుతోందన్నారు. "ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం" లక్ష్యంగా పారిశుధ్యం, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎమ్మెల్యే తెలిపారు. నగరంలో 33 పార్కులను యోగా, స్పోర్ట్స్, ఫ్రూట్స్ వంటి థీమ్‌లతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పుష్కరాల కోసం మంజూరైన రూ.580 కోట్లలో రూ.140 కోట్లు డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకే కేటాయించామని వెల్లడించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను "మన వార్డులో మన ఆదిరెడ్డి" కార్యక్రమం ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, గత ప్రభుత్వంలో మరణించిన, రిటైర్ అయిన కార్మికుల స్థానాలు భర్తీ చేయకపోయినా, కూటమి ప్రభుత్వం 79 మంది కుటుంబ సభ్యులకు కార్పొరేషన్‌లో ఉద్యోగాలు కల్పించిందన్నారు. ఇది రాష్ట్రంలోనే చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రిక్షా కార్మికుల వేతనాలను రూ.9 వేల నుంచి రూ.15 వేలకు, 54 మంది డ్రైవర్ల వేతనాలను రూ.15 వేల నుంచి రూ.18,500కు పెంచామని తెలిపారు. కార్మికుల నియామకాల్లో పూర్తిస్థాయి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) అమలు చేసి, ఎక్కడా అవినీతికి తావులేకుండా వ్యవస్థను పారదర్శకంగా రూపొందించామని చెప్పారు. "మన వార్డులో మన ఆదిరెడ్డి" కార్యక్రమం ద్వారా కార్యకర్తల ఇళ్లలో బస చేస్తూ, ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమం వల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకుల మధ్య సమన్వయం పెరిగిందని, ప్రజల నుంచి నేరుగా సూచనలు అందుతున్నాయని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తూ, ప్రజలు వారిని "గొడ్డలి పార్టీ", "విధ్వంసానికి కేరాఫ్ అడ్రస్"గా భావిస్తున్నారన్నారు. ఫేక్ ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టలేరని, ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని వ్యాఖ్యానించారు. కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం చట్టపరమైన అంశాలను పరిశీలిస్తోందని, అన్ని విషయాల్లో ప్రజలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. చివరగా మీడియాకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, గత రెండేళ్లుగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా అందించిన సహకారం అమూల్యమని కొనియాడారు. భయపెట్టే, బెదిరించే రాజకీయాలు తమవి కావని, అందరినీ కలుపుకొని పారదర్శక పాలన కొనసాగిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. కాగా మీడియా సమావేశానికి ముందుగా ఇటీవల మృతి చెందిన సీనియర్ రిపోర్టర్ రత్న కిషోర్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం వహించారు. మీడియా సమావేశంలో నాయకులు మజ్జి రాంబాబు, నక్కా చిట్టిబాబు, కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, బుడ్డిగ రవి, ద్వారా పార్వతి సుందరి, ఉప్పులూరి జానకి రామయ్య, శెట్టి జగదీష్, దాస్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ మండల వైద్యవిభాగం అధ్యక్షులుగా ధారా



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్యుల విభాగం అధ్యక్షులుగా దారా వీర వెంకట సత్యనారాయణను నియమించినట్లు వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా తెలిపారు. మంగళవారం వైయస్సార్సీపి కోరుకొండ మండలం డాక్టర్స్ అధ్యక్షులుగా ధారా వీర వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా రాయుడు రాజేశ్వరరావు, మండపాక మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా కందికట్ల ఆనంద్ కుమార్,కాళ్ళ కృష్ణ,పర్ణశాల రంగా చార్యులు, పెనుగుల కృష్ణంరాజులను నియమించామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీసభ్యులకు జక్కంపూడి రాజా, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా నూతన కమిటీసభ్యులు జక్కంపూడి రాజా, పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీ శ్రీ శ్రీ భూలోకమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి

## రూ. 55000/-ల విరాళం అందించిన పలివెల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం లోని సింగవరం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ భూలోకమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పలివెల వీరబాబు 55 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులైన సింగవరం గ్రామ మాజీ సర్పంచ్ సంఘన పోసయ్య, గంగిరి భూపతిరావు, సంగన చిన పోసియ్య, గంగిరి శ్రీను, చొక్కా సత్యనా రాయణ, వేముల వెంకన్నలకు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ అమ్మవారి దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందించానని అన్నారు. సింగవరం గ్రామా భివృద్ధి తన ధ్యేయమని తెలిపారు. సింగవరం గ్రామం నందు వెలిసిన భూలోకమతల్లి అమ్మవారు చాలా శక్తివం తమైన వారిని భక్తుల కోరిన కోరికలు తీరుతాయని ప్రజల నమ్మకమని అన్నారు అమ్మవారి ఆలయ నిర్మా ణానికి దాతలు మరికొందరు ముందుకు రావాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ పార్టీ నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు పలివెల జ్యోతి, మండల అధ్యక్షుడు నందమూరి చిట్టి స్వామి, మండల మహిళా అధ్య క్షురాలు తవిటికి సునీత తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పంచ పర్వములలో మహా పర్వమైనటువంటి అమావాస్య రోజున శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం ప్రాంగణంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద సోమవారం జేష్ఠ మాస అమావాస్య సందర్భంగా అత్యంత విశేషమైన ప్రయుక్త శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం జరిగింది. భారతదేశంలోని మొట్టమొదటిసారిగా వాహనంతో కూడుకున్న మహాలక్ష్మి హోమం జరగడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి హోమంలో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ బోడెం నాగ సత్య రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో పండిత పురోహితుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. దర్శ (అమావాస్య) రోజున చేసే శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం చాలా పవిత్రమైనదని, ఈ హోమం వలన సంపద, ఆర్థిక స్థిరత్వం, ఇతర సమస్యల పరిష్కారం కోసం చేసే ఒక శక్తివంతమైన పూజా విధానమని,దీని ద్వారా లక్ష్మీదేవి, కుబేరుడు, సుదర్శన చక్రం (విష్ణుమూర్తి) యొక్క అనుగ్రహం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్మదాసు ప్రభాకర్, మంజు దంపతులు,మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ ,ఉమా మార్కండేయ లలితా మండలి సభ్యులు పాల్గొన్నారు.పూజ కార్యక్రమాల నిమిత్తం ఆసక్తి కలవారు బోడెం నాగ సత్య రవికుమార్ శర్మ 9908798988 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. ప్రతి నెల అమావాస్య రోజున ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

### పుష్కరాల ఏర్పాట్లపై ఎస్పీ, జేసితో కలిసి

# క్షేత్ర స్థాయిలో విస్తృత పరిశీలన

**పుష్కర్ నగర్లు, పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు ముందస్తు కార్యాచరణ : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కొవ్వూరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, కొవ్వూరు ఆర్డీవో కె.ఆనందరావు, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ రెడ్డి, ఏ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, డీఎస్పీ డి.దేవకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా దొమ్మేరు శివారులోని ప్రైవేట్ భూములు, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే, గ్రీన్ ఫీల్డ్ టోల్ గేట్, దేవరపల్లి డైమండ్ జంక్షన్, ప్రక్కిలంక ఘాట్, పైడిమట్ట గ్రామం, తాళ్లపూడి, కుమారదేవం తదితర ప్రాంతాల్లో పుష్కర్ నగర్లు, వాహన పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, భక్తుల రాకపోకలకు అనువైన ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఏర్పాటును ముందస్తుగా శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధంగా రూపొందిస్తున్నామని తెలిపారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, తాత్కాలిక వసతి, మరుగుదొడ్లు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి అన్ని సౌకర్యాలు సమర్థవంతంగా అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పుష్కర్ నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసే సమయంలో వరద ముప్పు, భద్రత, రవాణా సౌలభ్యం, అత్యవసర సేవలు చేరుకునే అవకాశం వంటి అంశాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేసి, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం పుష్కర స్నాన ఘట్టాలను సందర్శించిన అధికారులు ఘాట్ల వద్ద నీటి లోతు, ప్రవాహ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, ఘాట్ల విస్తరణ అవసరం, బ్యారికేడింగ్, హెచ్చరిక బోర్డులు, లైటింగ్ తదితర అంశాలను పరిశీలించారు. స్థానిక ప్రజలు, మత్స్యకారులు, గ్రామ పెద్దల నుంచి గత పుష్కరాల అనుభవాలు, నీటి మట్టం మార్పులు, ప్రమాదకర ప్రాంతాలపై సమగ్ర వివరాలు సేకరించి వాటి ఆధారంగా కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఘాట్ల వద్ద తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధంగా వైద్య, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయ ప్రణాళిక సిద్ధం చేయాలి. రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళిక రూపొందించాలి. స్థానిక సంస్థలు, గ్రామస్థుల సహకారంతో అవసరమైన సమాచారం సేకరించి కార్యాచరణను మరింత సమర్థవంతంగా రూపొందించాలన్నారు.

**భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం : జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్**

జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ వ్యవస్థ, అత్యవసర స్పందన బృందాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఘాట్ వద్ద భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తామని చెప్పారు.

**జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ సూచనలు**

జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ అధికారులకు పలు సూచనలు చేశారు. పుష్కర్ నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. పార్కింగ్ స్థలాలకు స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలి.ఈ పరిశీలనలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలు, ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యడ్ల మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి వర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు ధవళేశ్వ రంలో జనసేన నాయకులు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ధవళేశ్వరం బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలో పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకొని, తిరిగి ప్రజాసేవలో అదే ఉత్సాహంతో చురుకుగా పాల్గొనాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం జనసేన నాయకులు మగాపు నూకరాజు, వర్రే రమేష్, సురాడి సత్తిబాబు, దారపు శివారెడ్డి, షేక్ అమీనా, మట్టపర్తి నాగరాజు, విజ్జన శివ, పిల్లి వెంకటరమణ గారు, దూది సాయి,పులపర్తి కిషోర్, దిండి జగదీష్, వాన నారాయణ, దాము తదితరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనల్లో భాగస్వాములయ్యారు. పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా కొనసాగాలని భగవంతుడిని అందరూ మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు | వాహనాల అమ్మకం | ట్యూషన్ & & విద్య | ఉద్యోగ అవకాశాలు | సర్వీసు& రిపేర్లు | ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# ఇదొక అరుదైన, గొప్ప సినిమా..


### మూడు గంటలు కేటాయించి తప్పక చూడండి : సందీప్ రెడ్డి వంగా



సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి సాధారణంగా వేరొకరి గురించి కానీ వేరే సినిమాల గురించి కానీ పెద్దగా మాట్లాడరు. అలాంటిది ఆయన నోటి నుంచి ఒక సినిమా పేరు వచ్చిందంటే అందులో ఏదో ఒక బలమైన విషయం ఉందని అర్థం చేసుకోవచ్చు. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా రేంజ్ లో ఫేమస్ అయిపోయాడీ టాలీవుడ్ ట్యాలెంటెడ్ డైరెక్టర్. ప్రస్తుతం ప్రభాస్ తో కలిసి స్పిరిట్ అనే హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ను తెరకెక్కిస్తున్నాడు సందీప్ రెడ్డి వంగా. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ లో బిజీ బిజీగా ఉంటున్నాడు సందీప్. కాగా ఈ డైరెక్టర్ సినిమాల్లాగే ఆయన మాటలు కూడా స్ట్రెయిట్ ఫార్వర్డ్ గానే ఉంటాయి. ఎలాంటి ఫిల్టర్ ఉండదు. అలాంటి సందీప్ రెడ్డి వంగా తాజాగా ఓ సినిమాను చూసి ప్రశంసలు కురిపించాడు. అంతేకాదు ఒక మూడు గంటలు ఈ సినిమా కోసం కేటాయించి తప్పక చూడాలని విజ్ఞప్తి చేశాడు. మరి సందీప్ రెడ్డి వంగాకు అంత బాగా నచ్చిన సినిమా ఏదనుకుంటున్నారా? టాలీవుడ్ ట్యాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సినిమా రావు బహదూర్. వెంకటేష్ మహా తెరకెక్కించిన ఈ సినిమా జులై 03న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఒక డిఫరెంట్ సైకలాజికల్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమాకు థియేటర్లలో మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. ముఖ్యంగా చాలా మంది ఆడియెన్స్ కు ఈ సినిమా సరిగా కనెక్ట్ అవ్వడం లేదు. అయితే రావు బహదూర్ సినిమా చూసిన వారంతా సత్యదేవ్ నటనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అతని యాక్టివ్ నెక్స్ట్ లెవెల్ అంటూ తెగ మెచ్చుకుంటున్నారు. తాజాగా సందీప్ రెడ్డి వంగా కూడా రావు బహదూర్ సినిమాను చూశాడు. అనంతరం సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'మనం అసలు సినిమాలను ఎందుకు ప్రేమించామో గుర్తు చేసే అత్యంత అరుదైన, గొప్ప చిత్రాలలో ఇది ఒకటి. సినిమాను ప్రాణంగా ప్రేమించే ప్రతి ఒక్కరికీ నాదొక చిన్న విజ్ఞప్తి. మీ జీవితంలో ఒక మూడు గంటల సమయాన్ని ఈ సినిమా కోసం కేటాయించండి. మీ శ్రద్ధకు, మీ ఓపికకు, మీ చప్పట్లకు ఈ మూవీ ఖచ్చితంగా అర్హమైనది. పరిమిత బడ్జెట్, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ, దర్శకుడు వెంకటేష్ మహా ఈ చిత్రాన్ని ఎంతో అద్భుతమైన ఖచ్చితత్వంతో తెరకెక్కించారు. ఇలాంటి డిఫరెంట్ సినిమాను రూపొందించడానికి ఎంతో ధైర్యం, బలమైన నమ్మకం కావాలి. హీరో సత్యదేవ్ అద్భుతంగా నటించాడు. ఎలాంటి హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు.. కేవలం ప్యూర్ ఫిల్మ్ మేకింగ్ మాత్రమే కనిపించింది. కల్తీ లేని కథాంశంతో, రాజీపడని రీతిలో సినిమాను నిర్మించిన విధానం అద్భుతం. ఇలాంటి సినిమాలను ప్రేక్షకుడు తప్పకుండా ఆదరించాలి' అంటూ 'రావు బహదూర్' చిత్ర బృందం మొత్తానికి అభినందనలు తెలియజేశారు సందీప్ రెడ్డి వంగా.

# 'మా ముందే దుస్తులు వేసుకోవచ్చుగా?'..

### ఫోటోగ్రాఫర్ కామెంట్ పై హీరోయిన్ ఆగ్రహం..



బాలీవుడ్ ప్రముఖ నటి , మోడల్ అయిన జరీన్ ఖాన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 2010లో అనిల్ శర్మ దర్శకత్వంలో వచ్చిన 'వీర్' సినిమాతో ఆమె బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రంలో ఆమె సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ సరసన నటించారు. ఆ తర్వాత ఆమెకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. కానీ సల్మాన్ ఖాన్ నటించిన 'రెడీ' (2011) చిత్రంలో ఆమె చేసిన "క్యారెక్టర్ ఢీలా" స్పెషల్ సాంగ్ ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. బాలీవుడ్ స్టార్స్ ఎక్కడికి వెళ్లినా వారిని నీడలా వెంబడించడం, ఫోటోలు, వీడియోలు తీయడం ముంబై పాపరాజీలకు (ఫోటోగ్రాఫర్స్) అలవాటే. అయితే కొన్నిసార్లు ఈ ఉత్సాహం హద్దులు దాటి సెలబ్రిటీల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ ఉంటుంది. ఇదివరకు చాలా మంది సెలబ్రెటీలు ఫోటోగ్రాఫర్స్ కారణంగా ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నాయి. అలాగే ఇటీవల కొందరు హీరోయిన్స్ తమను వెనుక నుంచి ఫోటోస్ తీయడం.. అలాగే జూమ్ చేస్తూ ఫోటోస్ తీయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే తాజాగా బాలీవుడ్ నటి జరీన్ ఖాన్‌కు ముంబైలో ఇలాంటి ఒక చేదు అనుభవమే ఎదురైంది. తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కొందరు ఫోటోగ్రాఫర్లపై ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల జరీన్ ఖాన్ ముంబైలోని ఒక ప్రముఖ డిజైనర్ స్టోర్‌కు వెళ్లారు. అక్కడ ఆమె కొన్ని దుస్తులను చూపిస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. ఈ క్రమంలోనే సెలబ్రిటీల కదలికలపై నిఘా ఉంచే పాపరాజీలు అక్కడికి కూడా చేరుకుని, ఆమె లోపలికి వెళ్తున్న సమయంలో కెమెరాలతో చుట్టుముట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కొందరు ఫోటోగ్రాఫర్లు అత్యుత్సాహం ప్రదర్శించారు. అందులో ఒక ఫోటోగ్రాఫర్ ట్రయల్ కరో.. (దుస్తులు వేసుకోండి) అని అన్నారు. ఈ కామెంట్స్ విన్న జరీన్ ఖాన్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తీవ్ర అసహనానికి లోనైన ఆమె, అక్కడికక్కడే ఆ ఫోటోగ్రాఫర్లపై మండిపడ్డారు. ఏంటీ.. మీ ముందేనా... ? ఇలాంటి ఫాల్తూ మాటలు నా ముందు మాట్లాడొద్దు. మీ హద్దులు దాటొద్దు అంటూ గట్టిగానే వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. అలాగే మహిళల పట్ల మాట్లాడేటప్పుడు కనీస మర్యాద, విచక్షణ ఉండాలని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. జరీన్ ఖాన్ తీసుకున్న నిర్ణయాన్ని, ఆమె స్పందించిన తీరును నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. సెలబ్రిటీలకైనా ప్రైవసీ ఉంటుందని, ఇలాంటి అసభ్యకర వ్యాఖ్యలను అస్సలు సహించకూడదని మద్దతు తెలుపుతున్నారు. పాపరాజీలు తమ పరిధులు తెలుసుకుని ప్రవర్తించాలని, పబ్లిక్ లైఫ్‌లో ఉన్నంత మాత్రాన వ్యక్తిగత గౌరవాన్ని పణంగా పెట్టలేరని బాలీవుడ్ వర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి. సల్మాన్ ఖాన్ 'వీర్' సినిమాతో బాలీవుడ్‌కు పరిచయమైన జరీన్ ఖాన్, తన బోల్డ్ , స్పష్టమైన వైఖరితో ఈ ఘటన ద్వారా మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం స్పెషల్ సాంగ్స్ చేస్తుంది.

# ఇంగ్లాండ్ గడ్డపై భారత్ ఘనవిజయం..

### గిల్, అక్షర్, సుందర్ వీరోచిత పోరాటంతో తొలి వన్డే మనదే!



ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న టీమిండియా ఎట్టకేలకు పటిష్టమైన విజయంతో బోణీ కొట్టింది. బర్మింగ్‌హామ్‌లోని ప్రసిద్ధ ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన ఉత్కంఠభరితమైన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఆతిథ్య ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. ఈ అద్భుత విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో టీమ్ ఇండియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సీనియర్ ఆటగాళ్లు చేతులెత్తేసినా, యువ రక్తం మరియు ఆల్‌రౌండర్ల అద్భుత ప్రదర్శనతో భారత్ విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 258 పరుగులకు ఆలౌట్ అయింది. ఒక దశలో ఓపెనర్లు ధాటిగా ఆడటంతో ఇంగ్లాండ్ వికెట్ నష్టపోకుండా 61 పరుగులతో పటిష్టంగా కనిపించింది. అయితే, భారత బౌలర్లు పుంజుకోవడంతో కేవలం 107 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. బెన్ డకెట్ (43), జాకబ్ బెథెల్ (14), హ్యారీ బ్రూక్ (1), కెప్టెన్ జోస్ బట్లర్ (5), సామ్ కర్రన్ (0) వరుసగా పెవిలియన్ చేరారు. ఈ దశలో సీనియర్ బ్యాట్స్‌మెన్ జో రూట్ అజేయంగా 76 పరుగులు, లియామ్ డాసన్ (68) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 134 బంతుల్లో 121 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 9.5 ఓవర్లలో 62 పరుగులిచ్చి 4 వికెట్లతో ఇంగ్లాండ్ నడుము విరిచాడు. ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ చెరో రెండు వికెట్లు తీయగా, జస్ప్రీత్ బుమ్రా, శివమ్ దూబేలకు ఒక్కో వికెట్ దక్కింది.

**రోకో విఫలం.. నిలబెట్టిన గిల్, అయ్యర్**

259 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే భారీ షాక్‌లు తగిలాయి. స్టార్ బ్యాట్స్‌మెన్ రోహిత్ శర్మ (11), విరాట్ కోహ్లీ (5) త్వరగానే అవుట్ కావడంతో భారత్ 48 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. ఈ దశలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 109 పరుగుల అద్భుత భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. శ్రేయస్ అయ్యర్ 35 పరుగులు చేసి రనౌట్ అవ్వగా, కెప్టెన్ గిల్ 75 బంతుల్లో 80 పరుగులతో సూపర్ ఫామ్‌లో ఉంటూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. అయితే, సెంచరీకి చేరువవుతున్న తరుణంలో నడుము నొప్పితో బాధపడుతూ గిల్ గాయంతో రిటైర్డ్ హర్ట్ తో మైదానాన్ని వీడాల్సి వచ్చింది.

**అక్షర్, సుందర్ మ్యాచ్ విన్నింగ్ భాగస్వామ్యం**

గిల్ నిష్క్రమణ తర్వాత మ్యాచ్ ఇంగ్లాండ్ వైపు మళ్లుతుందని భావించిన తరుణంలో ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించారు. ఇంగ్లీష్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ రన్ రేట్ తగ్గకుండా ఆడారు. వాషింగ్టన్ సుందర్ 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 63 బంతుల్లో 52 పరుగులు చేయగా, అక్షర్ పటేల్ 52 బంతుల్లో 57 పరుగులతో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 102 పరుగుల సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి, 46వ ఓవర్లలోనే భారత్‌ను విజయతీరాలకు చేర్చారు. బంతితో నాలుగు వికెట్లు తీసి, బ్యాటింగ్‌లోనూ హాఫ్ సెంచరీతో మెరిసిన అక్షర్ పటేల్ ఈ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

### భారత చదరంగంలో

# మరో సంచలనం..

### 98వ గ్రాండ్‌మాస్టర్‌గా 17 ఏళ్ల అశ్వత్ ఎస్..!



భారతదేశం నుంచి వంద మంది గ్రాండ్‌మాస్టర్ల మైలురాయికి చేరువవుతున్న తరుణంలో అశ్వత్ సాధించిన ఈ విజయం దేశ ప్రతిష్టను మరింత పెంచింది. ఎందరో యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్న అశ్వత్ ఎస్, భవిష్యత్తులో ప్రపంచ చదరంగ పీఠాన్ని అధిరోహించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. భారత చదరంగ క్రీడా ప్రపంచంలో సరికొత్త అధ్యాయం నమోదైంది. తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల నవయువకుడు అశ్వత్ ఎస్ దేశంలోనే 98వ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించి సరికొత్త రికార్డు సృష్టించాడు. బుద్ధిబలంతో అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతున్న భారత మేధస్సుకు ఈ సరికొత్త విజయం మరో మచ్చుతునకగా నిలిచింది.

**కన్యాకుమారి నుంచి అంతర్జాతీయ వేదిక వరకు.. అశ్వత్ అద్భుత ప్రస్థానం..**

భారతదేశ 98వ గ్రాండ్‌మాస్టర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించిన అశ్వత్ ఎస్ తమిళనాడులోని కన్యాకుమారి ప్రాంతానికి చెందినవాడు. 2008లో జన్మించిన ఈ అద్భుత బాలుడు కేవలం మూడు సంవత్సరాల చిన్న వయసులోనే చదరంగం బోర్డుతో స్నేహం చేశాడు. ఆటలో ఉన్న మెళకువలను వేగంగా అందిపుచ్చుకుంటూ, పిన్న వయసులోనే పెద్దలనే అబ్బురపరిచే వ్యూహాలతో చదరంగ పావులను కదపడం ప్రారంభించాడు. చిన్నతనం నుంచే ఆటపై చూపిన శ్రద్ధే నేడు అతడిని ఈ అత్యున్నత స్థానంలో నిలబెట్టింది.

**తండ్రే తొలి గురువు.. అకాడమీలో రాటుదేలిన ప్రతిభ..**

అశ్వత్ విజయ ప్రస్థానంలో అతని తండ్రి ఏసీ శివ పాత్ర ఎంతో కీలకమైనది. స్వయంగా ఒక అకాడమీ నడుపుతున్న ఏసీ శివ, తన కుమారుడిలోని అసాధారణ ప్రతిభను ముందే గుర్తించారు. తండ్రి పర్యవేక్షణలో, సరైన వ్యూహాలు, కఠినమైన శిక్షణతో అశ్వత్ రోజురోజుకూ తన ఆటను మరింత మెరుగుపరుచుకున్నాడు. తండ్రి అందించిన ప్రోత్సాహం, గురువుగా నేర్పిన విజ్ఞానం అశ్వత్ ఎదుగుదలకు బలమైన పునాదిగా మారాయి.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com